


నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక



విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి విశాఖపట్నం వస్తున్నారు. రాత్రి 11.30 గంటలకు విమానంలో ఇక్కడికి వచ్చి పార్టీ కార్యాలయం ఆవరణలో బస చేస్తారు. మరుసటిరోజు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆయన తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం గీతం యూనివర్సిటీలో ఉంది. దానికి హాజరు అవుతారు. ఇతర అధికారిక కార్యక్రమాలు ఇంకా వెల్లడించలేదు.

ఎస్సీ హాస్టళ్లకు మోక్షం

విద్యార్థుల వసతిగృహాలకు మరమ్మతులు

జిల్లాలో పది హాస్టళ్లకు రూ.2 కోట్లు మంజూరు



చోడవరంలోని బాలికల వసతిగృహం పైకప్పు తొలగిస్తున్న దృశ్యం

- సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఇప్పటికే పనులు ప్రారంభం
- వేసవిలోగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు
- తొలగనున్న విద్యార్థుల కష్టాలు

చోడవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): **సాంఘిక సంక్షేమ వసతిగృహాల రూపురేఖలు మారనున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేయించి ఇతర సమస్యలను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో పది వసతిగాహాలను అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరయ్యాయి. సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఇప్పటికే మరమ్మతు పనులు ప్రారంభించారు.**

గ్రామీణ ప్రాంతంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలు చాలా ఏళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. హాస్టళ్లలో సౌకర్యాల లేమితో విద్యార్థులు అవస్థలు పడుతూ వస్తున్నారు. వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, కనీస సౌకర్యాలు మెరుగుపరచాలంటూ విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేసినా.. గత వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. ఈ నేపథ్యంలో వర్షం పడితే కారిపోయే శ్లాబ్, దుర్గంధం వెదజల్లే మరుగుదొడ్లు, గదుల్లో అడ్డదిడ్డంగా వేలాడే విద్యుత్ వైర్లు, వెలగని దీపాలు, విరిగిపోయిన కిటికీలు, తలుపులతో అత్యంత దయనీయంగా వున్న ఎస్సీ విద్యార్థుల హాస్టల్ భవనాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టింది. చోడవరం పట్టణంలోని బాలుర హాస్టల్, బాలికల హాస్టల్, బుచ్చెయ్యపేట మండలంలో బాలుర వసతిగృహం, కె.కోటపాడులో బాలికల హాస్టల్, కశింకోటలో బాలికల హాస్టల్, అనకాపల్లిలో బాలురు హాస్టల్, పరవాడలో బాలికల హాస్టల్, అచ్యుతాపురంలో బాలుర హాస్టల్, ఎ.కోడూరులో బాలుర హాస్టల్ భవనాలను అభివృద్ధి చేయనున్నారు. వసతిగృహంలో గుర్తించిన సమస్యల మేర అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో హాస్టల్‌కు రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ప్రభుత్వం కేటాయించింది. పది వసతి గృహాలకు కలిపి సుమారు రూ.2 కోట్లు మంజూరైనట్టు సంబంధిత అధికారులు తెలిపారు. వర్షం పడితే కారిపోతున్న భవనాల శ్లాబ్‌లను పూర్తిగా తొలగించి, కొత్త శ్లాబ్‌లు వేస్తున్నారు. ఇంకా ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్, మరుగుదొడ్లకు మరమ్మతులు, తాగునీటి వనరుల అభివృద్ధి, పెయింటింగ్ వంటి పనులు చేపడతారు. హాస్టల్ పరిసరాలను అందంగా తీర్చిదిద్దుతారు.

ప్రస్తుతం వసతిగృహాల్లో చేపట్టిన పనులు వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేనాటికి భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చోడవరంలోని గాంధీగ్రామంబాలుర వసతి గృహం, చీడికాడ రోడ్డులోని బాలికల వసతి గృహం మరమ్మతు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.



గాంధీగ్రామంలోని బాలుర హాస్టల్‌లో ప్రారంభమైన అభివృద్ధి పనులు

వేసవి సెలవుల్లో పనులు పూర్తి



సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో నడుస్తున్న ఎస్సీ విద్యార్థుల వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొన్నిచోట్ల ఇప్పటికే పనులు మొదలయ్యాయి. విద్యా ర్థులు ఇబ్బంది పడకుండా వేసవి సెలవుల్లో పనులు చేస్తారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

- బి.ఈశ్వరరావు, జిల్లా సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి

పేదల లేఅవుట్లకు తూట్లు

ఇళ్ల స్థలాలను ఆనుకొని ఇష్టారాజ్యంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు

- పునాదులు సైతం ధ్వంసం
- పట్టించుకోని వీఎంఆర్‌డీఏ అధికారులు



పైడివాడ అగ్రహారం లేఅవుట్‌లో పేదల ఇళ్లను ఆనుకుని గ్రావెల్ తవ్వకాలు జరపడంతో ఏర్పడిన భారీ గొయ్యి.

సబ్బవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని పలు గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో వేసిన ఇళ్ల స్థలాల లేఅవుట్లలో గ్రావెల్ తవ్వకాలు ఆగడంలేదు. లే-అవుట్ల అభివృద్ధికి, ఇళ్ల పునాదులు నింపేందుకు సమీపంలో ఉన్న వ్యర్థ పదార్థాలను వినియోగించుకోవడానికి అనుమతించాలంటూ ఉన్నతాధికారులకు స్థానిక తహసీల్దారు ఇచ్చిన లేఖను అడ్డం పెట్టుకుని ఖాళీ స్థలాల్లో, ఇళ్లకు ఆనుకుని గ్రావెల్ తవ్వుకుపోతున్నారు.**

మండలంలోని పైడివాడ, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం, గొల్లల పాలెం, అసకపల్లి, అజనగిరి, నంగినారపాడు, గాలి భీమవరం గ్రామాల్లో గత ప్రభుత్వం హయాంలో రైతుల నుంచి భూములను సమీకరించి, పేదలకు ఇళ్ల స్థలాల కోసం లేఅవుట్లు వేశారు. ఈ స్థలాలతోపాటు రైతులకు పరిహారంగా ఇచ్చిన స్థలాలను అభివృద్ధి చేసుకోవడానికి అవసరమైన గ్రావెల్ తవ్వుకునేందుకు నాడు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. కానీ నాడు వైసీపీ నాయకుల అండదండలతో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన లే-అవుట్లకు అనుకొని ఉన్న కొండవాలు ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమంగా తవ్వి, తరలించుకుపోయారు. పైగా ఆయా వాహనాలపై 'వీఎంఆర్‌డీఏ' స్టిక్కర్లు అతికించి, దర్జాగా గ్రావెల్, మట్టి తవ్వుకున్నారు. కొంతకాలం తరువాత పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో గ్రావెల్ తవ్వుకోవడం మొదలు పెట్టారు. అప్పట్లో పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు.

కూటమి హయాంలోనూ ఆగని గ్రావెల్ తవ్వకాలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నుంచి ఇటీవల వరకు ఇళ్ల స్థలాల లేఅవుట్‌లలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు కొంతమేర ఆగాయి. దీంతో లే-అవుట్లు, భూములు ఇచ్చిన రైతుల పరిహారం ప్లాట్లలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఈ విషయం తహసీల్దార్ బి.చిన్ని కృష్ణ దృష్టికి రావడంతో లే-అవుట్లు, రైతుల రిటర్న్ ప్లాట్ల అభివృద్ధికి సమీపంలో ఉన్న వ్యర్థాలను వినియోగించుకోవడానికి అనుమతించాలని జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ ఈఈ, ఆర్‌డీఓ, మైనింగ్ ఏడీ, స్థానిక పోలీసులకు గత నెల 27న లేఖలు రాశారు. ఆయా అధికారుల నుంచి ఇంకా అనుమతి రాలేదు. కానీ తహసీల్దారు పంపిన లేఖ జెరాక్స్ కాపీ ని పట్టుకొని, లేఅవుట్ల వద్ద గ్రావెల్ తవ్వేస్తున్నారు. కొన్నిచోట్ల ఇళ్ల పునాదులను ఆనుకుని గ్రావెల్ తవ్వడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. నంగినారపాడు, గంగవరం లే-అవుట్లలో సుమారు 1,000 ప్లాట్లు కనిపించ కుండా (గ్రావెల్ తవ్వకాలతో) పోయినట్టు వీఎంఆర్‌డీఏ హౌసింగ్ అధికారులు గుర్తించారు. పైడివాడ అగ్రహారంలో కూడా సుమారు 200 ప్లాట్లు కనిపించడంలేదు. కాగా ఇళ్ల స్థలాల లేఅవుట్లకు అనుకుని అక్రమంగా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై తహసీల్దార్ బి.చిన్నికృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, గ్రావెల్ లేదా మట్టి తవ్వుకునేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులతో మాట్లాడి, లేఅవుట్ అవసరాలకు వారే దగ్గరుండి గ్రావెల్ తవ్వేంచేలా చర్యలు తీసుకుంటానన్నారు.



లే-అవుట్‌లో ఇళ్ల పునాదులను ఆనుకుని గ్రావెల్ తవ్విన దృశ్యం



గ్రావెల్ తవ్వకాలు, రవాణాకు తీసుకువచ్చిన వాహనాలు

ఇసుక తవ్వకాలకు వేలం పాటలు!

గొట్టివాడలో రూ.19 లక్షలు, పందూరులో రూ.22.5 లక్షలు

- రాజకీయాలకు అతీతంగా వేలం పాటలు నిర్వహించిన యువకులు
- మాకవరపాలెం మండలం నారాయణరాజుపేటకు చెందిన ఓ వ్యక్తికి తవ్వకాలు, విక్రయం బాధ్యత
- ఒక్కో ఇసుక ట్రాక్టర్ నుంచి రూ.1,000 చొప్పున వసూలు



గొట్టివాడ వద్ద వరహా నదిలో ఇసుక తవ్వకాలు (ఫైల్ ఫొటో)

కోటవురట్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని వరహా నదిలో ఇసుక తవ్వకాలకు గొట్టివాడ, పందూరు గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా కొంతమంది యువకులు బృందంగా ఏర్పడి 'మా నది.. మా ఇసుక' అంటూ ఈ ప్రక్రియ నిర్వహించారు. గొట్టివాడలో రూ.19 లక్షలు, పందూరులో రూ.22..5 లక్షలకు వేలం పాటలు ఖరారయ్యాయి. ఈ గ్రామాల పరిధిలోని వరహా నదిలో ఇసుక తవ్వకాలు, విక్రయం హక్కులను మాకవరపాలెం మండలం నారాయణరాజుపేటకు చెందిన ఓ వ్యక్తికి అప్పగించారు.**

ఇళ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనుల కోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కోటవురట్ల మండలంలో పందూరు, గొట్టివాడ గ్రామాల వద్ద వరహా నదిలో ఉచితంగా ఇసుక తవ్వుకుని తీసుకెళ్లడానికి మండల అధికారులు అనుమతులు మంజూరు చేశారు. అయితే తమ గ్రామాల వద్ద వేరేవాళ్లు ఇసుక తవ్వుకుపోవడం ఏమిటంటూ గ్రామ దేవతల ఉత్సవాల ఖర్చుల పేరుతో గత ఏడాది స్థానిక నాయకులు వేలం పాటలు నిర్వహించారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు రూ.500 చొప్పున అనధికారికంగా వసూలు చేశారు. అప్పట్లో నిర్వహించిన వేలం పాటల గడువు ఇటీవల ముగియడంతో మరోసారి వేలం పాటలు నిర్వహించారు. గొట్టివాడలో ఐదుగురు వ్యక్తులు కలిసి సుమారు నెల రోజుల క్రితం రూ.19 లక్షలకు వేలం పాట నిర్వహించారు. వరహా నదిలో ఇందేశమ్మవాక ప్రాంతంలో ఇసుక తవ్వకాల కోసం మూడు రోజుల క్రితం పందూరులో 20 మంది యువకులు కలిసి రాజకీయాలకు అతీతంగా రూ.22.5 లక్షలకు ఇసుక వేలంపాట నిర్వహించారు. అనంతరం మాకవరపాలెం ... మిగతా 8వ పేజీలో

నిధుల స్వాహా వ్యవహారంలో సర్పంచ్ భర్తకు నోటీసు

గొలుగొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక భవన నిర్మాణం పేరుతో నిధులు స్వాహా చేసిన ఓ పంచాయతీ మహిళా సర్పంచ్ భర్తకు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల ఐదో తేదీలోగా డబ్బులు చెల్లించాలని, లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వుంటుందని హెచ్చరించారు. ఇందుకు సంబంధించి ఎంపీడీవో మేరీరోజీ తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీ జమ్మదేవిపేటలో 2022లో సామాజిక భవన నిర్మాణం జరిగింది. దీని నిర్మాణ పనులను పంచాయతీ సర్పంచ్ భర్త రామకృష్ణ చేపట్టారు. రూ.4.83 లక్షలు ఖర్చు అయినట్టు సాధారణ నిధుల నుంచి బిల్లు మంజూరు చేయించుకున్నారు. అయితే సుమారు రూ.2 లక్షలు చందాలుగా వేసుకుని సామాజిక భవనం పిల్లర్ల వరకు నిర్మించామని, సర్పంచ్ భర్త ఈ పనులు కూడా తానే చేసినట్టు బిల్లు తీసుకున్నారని ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామసభ ఏర్పాటుచేసి విచారణచేపట్టారు. నిధులు దుర్వినియోగం అయినట్టు నిర్ధారించిన అధికారులు.. రూ.1,51,181 గత నెల 20వ తేదీలోగా చెల్లించాలని ఆదేశించారు. కానీ ఇంతవరకు చెల్లించలేదు. దీంతో ఎంపీడీవో మరోసారి నోటీసు జారీ చేశారు. ఈ నెల 5వ తేదీలోగా డబ్బులు కట్టకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రభుత్వ భూముల్లో రోడ్ల నిర్మాణంపై చర్యలు

పరిశీలించిన ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులు

- ముగ్గురిపై కేసు నమోదు
- రోడ్డుకు అడ్డంగా గోతులు తవ్వి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు





పెదపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో గొయ్యి తీస్తున్న అటవీ సిబ్బంది. (ఇన్‌సెట్‌లో) రోడ్డు మధ్యలో గొయ్యి తవ్వి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఎలమంచిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీలోని పెదపల్లి సమీపంలోని ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా రోడ్ల నిర్మాణం చేపట్టిన వైనంపై అధికార యంత్రాగం కదిలింది. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'ప్రభుత్వ భూముల్లో దర్జాగా రోడ్ల నిర్మాణం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి నీరుపారుదల, అటవీ శాఖల అధికారులు స్పందించారు. అటవీ సెక్షన్ అధికారి బి.వి.రమణ, సిబ్బందితో అక్కడకు వెళ్లి చదును చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అటవీ ప్రాంతం మీదుగా ఎవరూ రాకపోకలు సాగించకుండా ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు మధ్యలో గొయ్యి తవ్వించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అటవీ భూముల్లో కాలిబాటను చదును చేసి చేపట్టిన మట్టి రోడ్డు నిర్మాణంపై ప్రాథమిక దర్యాప్తు జరిపి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. సమగ్ర విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. కాగా నీటిపారుదల శాఖ డీఈ సాయి ప్రశాంతి, ఏఈ రామకృష్ణ శేషుగెడ్డ రిజర్వాయర్ ప్రాంతాన్ని సందర్శించారు. పెదపల్లి నుంచి రిజర్వాయర్‌కు వెళ్లే మార్గంలో అనధికారికంగా వేసిన మెటల్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన చోట గొయ్యి తవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు డీఈ వద్దకు వచ్చి, తమ కోరిక మేరకే రోడ్డు నిర్మిస్తున్నారని, ఇందులో తప్పుపట్టడానికి ఏముందని ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణం వల్ల రవాణా సదుపాయం మెరుగుపడుతుందగన్నారు. ఇందుకు డీఈ స్పందిస్తూ.. అనుమతులు లేకుండా మెటల్ రోడ్డు నిర్మించకూడదని స్పష్టం చేశారు.

ముగిసిన ఎన్నికల కోడ్

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కోడ్ ఎత్తివేసినట్టు రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కోడ్ ఎత్తివేసినట్టు పేర్కొన్నారు. కోడ్ వల్ల నిలిచిపోయిన అనేక కార్యక్రమాలు ఇకపై యథావిధిగా జరుగుతాయన్నారు. కాగా జనవరి 29న ప్రారంభమైన ఎన్నికల కోడ్ మంగళవారం వరకూ కొనసాగింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ) 6.09

సహరి (గురు) 4.57

ఒక్క క్లిక్‌తో రిజిస్ట్రేషన్ సేవలు

- ఇంటి వద్దనే ఈసీలు, దస్తావేజు నకళ్లు పొందే అవకాశం
- కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చిన కూటమి ప్రభుత్వం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) భూములు, స్థలాలకు సంబంధించిన దస్తావేజు నకళ్లు, ఎంకంబర్స్‌మెంట్ సర్టిఫికెట్ (ఈసీలు) పొందడం సులభతరమైంది. ప్రత్యేక వెబ్‌పోర్టల్ అందుబాటులోకి తేవడం ద్వారా సేవలను మరింత విస్తృతం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో భూయజమానులు వీటిని పొందడానికి రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితులు ఉండేవి. నిత్యం సర్వర్ మొరాయించడంతో ఈసీలు, భూముల దస్తావేజు నకళ్లు పొందాలంటే భూ యజమానులు వ్యయప్రయాసలకు గురయ్యేవారు. గతంలో రిజిస్ట్రేషన్‌ల శాఖ వెబ్‌సైట్ ఆధారంగా వీటిని జారీ చేసేవారు. మీసేవ కేంద్రాలు, సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో ఈసీలు, దస్తావేజు నకళ్లు పొందాలనుకున్నా సాధ్యం కాకపోవడంతో సమీపంలో వున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూ యజమానుల కష్టాలను గుర్తించి ఈసీలు, దస్తావేజు నకళ్లను సులభంగా పొందేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చింది. భూ యజమానులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా ఈసీలు, దస్తావేజు నకళ్లను ఇంటి నుంచే పొందే సౌకర్యం కల్పించారు. నిర్దేశించిన ఫీజు చెల్లించి కొత్త వెబ్‌సైట్‌లో ఇంటి వద్ద నుంచే లాగిన్ అవడం ద్వారా వీటిని పొందే అవకాశం ఉంది. జిల్లాలో పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు, మీసేవ కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో వున్నప్పటికీ, వ్యక్తిగతంగా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటిలోనే ఈసీలు, దస్తావేజు నకళ్లు పొందే అవకాశం కల్పించారు.



ఆన్‌లైన్‌లో ఈసీలు పొందేందుకు అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రత్యేక పోర్టల్ ఇదే

ఇంటి నుంచే రిజిస్ట్రేషన్ నకళ్లు పొందడం ఎలా...

https://registration.ap.gov.in పోర్టల్‌లో కుడివైపు ఉన్న ఈసీ, సీసీ సెర్చ్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే సంబంధిత సేవలు ఉన్న పేజీ, ఈసీ సమాచారం చూడవచ్చు. ఇందులో సైన్డ్ ఈసీ, సైన్డ్ సీసీ అనే రెండు ఆప్షన్‌లు ... మిగతా 8వ పేజీలో

హోంమంత్రి జన్మదినం సందర్భంగా క్రికెట్ టోర్నీ

▸▸ విజేతకు రూ.లక్ష నగదు

నక్కపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బర్త్ డే వేడుకలను నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 24న హోం మంత్రి అనిత బర్త్‌డేను పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను చెప్పారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులంతా నియోజకవర్గానికి చెందిన వారై వుండాలని, ఇందుకుగానూ ఆధార్ కార్డులను కూడా పరిశీలిస్తామని చెప్పారు. మొదటి బహుమతి రూ.లక్ష నగదు, ద్వితీయ బహుమతిగా రూ. 50వేలు నగదు, మాన్ ఆఫ్ది సిరీస్ రూ.15వేలు, బెస్ట్ బ్యాట్‌మెన్ రూ.10వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ. 10వేలు బహుమతులుంటాయన్నారు. మంగళవారం నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు 10వ తేదీ వరకూ కొనసాగుతాయని, బహుశా 12వ తేదీన హోం మంత్రి అనిత టోర్నమెంట్‌ను ప్రారంభించే అవకాశం వుందని పార్టీ శ్రేణులు తెలిపాయి. స్థానిక హెటిరో మైదానంలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమాచారం లేకుండా సర్వే ఎలా చేస్తారు?

జానకయ్యపేట, సీహెచ్ఎల్ పురం రైతుల సూటిప్రశ్న

నక్కపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకయ్యపేట, సీహెచ్ఎల్ పురం గ్రామాల్లో బల్క్‌డ్రగ్ కోసం భూముల సేకరణకు సర్వే చేసేటప్పుడు కనీసం తమకు సమాచారం కూడా చెప్పలేదని, అనుమతుల్లేనిది ఎలా సర్వే చేస్తారని ఈ గ్రామాల రైతులు మంగళవారం సర్వే సిబ్బందిని ప్రశ్నించారు. సర్వే చేయడానికి కుదరదని తేల్చిచెప్పారు. అనంతరం సీహెచ్ఎల్‌పురంలోని ఒక ఆలయంలో రెండు గ్రామాలకు చెందిన రైతులు సమావేశమయ్యారు. కలెక్టర్ సమక్షంలో రైతులు, రెండు గ్రామాల పెద్దలతో మాట్లాడి, అంగీకారం తెలిపిన తరువాతే సర్వే చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కురందాసు సింహాచలం, మాజీ సర్పంచ్ కృష్ణారావు, జనసేన నాయకుడు అప్పలరాజు, పెద్దలు దేవర సత్తిబాబు, మామిడి కృష్ణ, కురందాసు బాబ్జీ, చందక నానాజీ, శివ, పంపనబోయిన తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ

ఎలమంచిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ విద్యార్థులకు పోక్సో యాక్ట్‌తోపాటు పలు రకాల చట్టాలు గురించి అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సావిత్రి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.నూకరాజు, ప్యానెల్ న్యాయవాదులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సామూహిక సిందూర పూజలు నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి తమలపాకులతో పూజలు చేశారు. స్థానికులు, పలు పార్టీల నాయకులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీసులు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలు, తదితర అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జి.అప్పన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు చట్టాలు, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పురుషోత్తం, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరికి అగ్గి తెగులు

▸▸ ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త రమణమూర్తి



వాడ్రాపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మునగపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో వరికి అగ్గి తెగులు సోకిందని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త రమణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేసి పలువురు రైతులు సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. అగ్గి తెగులు నివారణకు ఎకరాకు 200 ఎంఎల్ అమిస్టార్ మందును పిచికారీ చేయాలన్నారు. పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగులను కూడా పరిశీలించి వాటికి సోకిన తెగులు నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పద్మావతి, అగ్రనమీ, ఏడీఏ ఎం.రామారావు, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, సిబ్బంది శ్రీను, లక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ప్రకృతి సాగుకు పెట్టుగోళ్లపల్లి ఎంపిక

ఎస్.రాయవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైతులు శతశాతం ప్రకృతి వ్యవసాయం కింద పంటలు సాగు చేయడానికి మండలంలోని పెట్టుగోళ్లపల్లి గ్రామాన్ని ఎంపిక చేసినట్టు మండల వ్యవసాయాధికారిణి సౌజన్య తెలిపారు. మంగళవారం ప్రకృతి వ్యవసాయ డీపీఎం సీహెచ్ లచ్చన్న, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, వెలుగు ఏపీఎం కె. శివప్రసాద్, ఏవో సౌజన్య స్థానికులతో సమావేశమై ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా అవగాహన కల్పించారు. గ్రామానికి కావల్సిన పీఎండీఎస్ కిట్లు, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గట్లు బలపరచడం వంటి అంశాలు చేర్చడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే వాహనాలు

▸▸ సెజ్‌లో ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు



అచ్యుతాపురం ముసిలితల్లి ఆలయం వద్ద రోడుపై పార్కింగ్ చేసిన బస్సులు

అచ్యుతాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లో వాహనాల పార్కింగ్‌కి ప్రత్యేక స్థలం కేటాయించకపోవడంతో ప్రజలతోపాటు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెజ్‌లో సుమారు 400 వరకు కర్మాగారాలున్నాయి. ఇందులో పనిచేసే కార్మికులు, ఉద్యోగస్థులు రాకపోకలకు అనువుగా వందల సంఖ్యలో బస్సులు రెండు షిఫ్టుల్లో తిరుగుతుంటాయి. అలాగే సరుకు రవాణాతో వచ్చిన వాహనాలతోపాటు యంత్రాలు తీసుకువచ్చే భారీ వాహనాలు కూడా ప్రతి రోజు వందల సంఖ్యలో వస్తుంటాయి. కాని సెజ్‌లో పార్కింగ్‌కి అంటూ ఒక స్థలం కేటాయించకపోవడం విశేషం. దీంతో బస్సులు, లారీలతోపాటు భారీ వాహనాలు రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కార్మికులు, ఉద్యోగులను కర్మాగారాల వద్ద దించేసి బస్సులను సెజ్ ప్రధాన రోడ్డుపక్కన ఆపి మరమ్మతులు చేసుకోవడం, కడుక్కోవడం వంటివి చేస్తున్నారు. ఇక సుదూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన లారీలు, భారీ వాహనాలు రోడ్డు పక్కనే ఆపేసి వాహన సిబ్బంది వంటలు అక్కడే వండుకొని లారీల కిందే సేద తీరుతున్నారు. సాధారణ సమయంలో కన్నా షిఫ్టుల సమయంలో వందల సంఖ్యలో బస్సులు కర్మాగారాల వద్దకు రాకపోకలు జరుగుతున్నాయి. ఈసమయంలో వాహనాలు తప్పుకోవడానికి రోడ్డు ఖాళీ లేక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయాల్లో ద్విచక్రవాహనాలు కూడా తప్పుకోవడానికి వీలుండంటే ఇక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. వాహనాలు నిలుపుకోవడానికి, సిబ్బంది సేద తీరడానికి షెల్టర్‌లు ఏర్పాటు చేయాలని లారీ డ్రైవర్లు, వాహన చోదకులు, ఉద్యోగులు కోరుతున్నారు.

చురుగ్గా ఉపాధి హామీ పనులు



లాలంకోడూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాంబిల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీలలో ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉదయం 6 గంటలు 10.30 గంటల వరకు కూలీలు ఉపాధి పనులు చేస్తున్నట్టు ఏపీవో శ్రీనివాసరావు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి వేతనదారునికి 100 రోజులు పనులు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఉపాధి పనులు చేసే పరిసరాల్లో చలువ పందిర్లు ఏర్పాటు చేయడంతోపాటు, తాగునీరు, మందుల కిట్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. వేతనదారులకు రూ.250 నుంచి రూ.290 వరకు వేతనం వస్తుందన్నారు. పశువులకు గడ్డి పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకుంటే నిధులు మంజూరు చేస్తామన్నారు. మండలంలో 200 రైతు ఊట గుంటలు ఏర్పాటుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే పలు పంచాయతీల్లో 154 ఊటగుంటలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీనివాసరావు తెలిపారు.

అందరి సహకారంతో అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ

▸▸ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



రోడ్డు విస్తరణ సర్వేను పరిశీలించిన కలెక్టర్ విజయకృష్ణన్

మునగపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ త్వరగా పూర్తవుతుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించి జరుగుతున్న సర్వే పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. కొలతలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ మేరకు భూ సేకరణ అవసరం అవుతుందో అధికారులతో చర్చించారు. సర్వే పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆమె వెంట రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ఉన్నారు.



మంచులో స్కూల్‌కు వెళుతున్న విద్యార్థినులు

పల్లెల్లో తగ్గని పొగమంచు

కోటవురట్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు కారణంగా మండలంలో పలు గ్రామాల్లో చలి తీవ్రత తగ్గినా పొగమంచు తగ్గడం లేదు. సంక్రాంతి పండుగ దాటి నెల 20రోజులు గడిచినా పొగమంచ గతంలో కంటే ఎక్కువైంది. గత మూడు రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు పెరిగినా పొగమంచు తీవ్రత తగ్గుముఖం పట్టలేదు. ఉదయం 6 గంటల నుంచి పొగమంచు ప్రారంభమై 9గంటల వరకు కురుస్తోంది. మంచు తీవ్రతకు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పొగమంచుతో మామిడి పూతకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హామీలు నెరవేర్చకుంటే ఆందోళన

▸▸ ఆక్వా పరిశ్రమ యాజమాన్యానికి

రేవుపోలవరం, కొత్తరేవుపాలెం గ్రామస్థుల హెచ్చరిక



సాయి మెరైన్ ఆక్వా ప్రతినిధి రఘుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

ఎస్.రాయవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తరేవుపోలవరం పరిధిలోని సాయి మెరైన్ ఆక్వా పరిశ్రమ యాజమాన్యంతో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని రేవుపోలవరం, కొత్తరేవుపాలెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయా గ్రామాల ప్రజలు, కూటమి నాయకులు కంపెనీ ప్రతినిధి రఘుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన కూటమి నాయకులు మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమతో పంట కాలువలు, చెరువులు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చినా.. నేటికి కూడా అమలు చేయకపోవడంపై మండిపడ్డారు. లేబర్ యాక్ట్ అనుసరించి అన్‌స్కిల్డ్ లేబర్‌కు రోజుకు రూ. 465 నగదు చెల్లించాల్సి ఉండగా యాజమాన్యం కేవలం రూ.300 నుంచి రూ.340 వరకూ మాత్రమే చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని వారు ఆరోపించారు. కంపెనీ లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అధికంగా కల్పిస్తామని హామీ ఇచ్చినా యాజమాన్యం అమలు చేయడం లేదని విమర్శించారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేసి తాగునీరు సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీని యాజమాన్యం నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి హామీలన్నింటిని నెరవేర్చాలని, లేకుంటే ఆందోళన చేస్తామని కూటమి నాయకులు హెచ్చరించారు.

వెంకన్న ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

▸▸ సీఐ కుమారస్వామి



ఆలయంలో బందోబస్తు ఏర్పాట్లపై సూచనలిస్తున్న సీఐ కుమారస్వామి

నక్కపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నామని నక్కపల్లి సీఐ కె.కుమారస్వామి చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆలయంలో బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే క్యూ లైన్లు, పార్కింగ్ స్థలాలను ఆయన పరిశీలించారు. ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబుతో చర్చించారు. ఉత్సవాలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ చెప్పారు. మహిళా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మఫ్టీలో సిబ్బందితో నిరంతరం నిఘా పెడతామని చెప్పారు.

సాల్వియాస్ ఫార్మా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



అనకాపల్లి కార్మిక శాఖ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన

అచ్యుతాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సాల్వియాస్ ఫార్మా కర్మాగారం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అనకాపల్లి కార్మిక శాఖ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. ఈ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలల జీతాలు ఇవ్వకుండా కర్మాగారాన్ని మూసేశారనిచ ఇది చట్ట విరుద్ధమన్నారు. పరిశ్రమ అకారణంగా మూసివేయడంతో 60మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. బకాయి పడ్డ జీతాలు ఇవ్వడంతో పాటు కర్మాగారాన్ని వెంటనే తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక శాఖ కమిషనర్‌కి వినతిపత్రాన్నిచ్చారు. ఈకార్యక్రమంలో నాగేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

చికెన్‌పాక్స్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

కోటవురట్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్‌లో చికెన్‌పాక్స్ వ్యాధి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హోమియోపతి డాక్టర్ రమణరావు సూచించారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో చికెన్‌పాక్స్‌వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ పాక్స్ వ్యాధి వేసవిలో పిల్లలకు సోకుతుందన్నారు. వ్యాధి రాకుండా హోమియోపతి మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సరితాదేవి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందజేసిన కొల్లేరు ఐటీఐ నిర్వాహకులు

నక్కపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం హైస్కూల్‌లో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న నైట్ స్టడీ అవర్‌లో మంగళవారం రాత్రి చినగుమ్ములూరు కొల్లేరు ఐటీఐ ప్రిన్సిపాల్ బి. గోపాలరాజు నేతృత్వంలో అల్పాహారం అందజేశారు. 45 రోజుల నుంచి రోజూ రాత్రి వేళల్లో పిల్లల కోసం అదనపు తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, పల్గుణరావు, కుమారి, చిన్నారావు, రమేశ్‌బాబు, హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ, మందపాటి కృష్ణ, శ్రావణి శిరీష, సూర్య పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు : టీడీపీ



ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడుతున్న వెంకటేశ్

నక్కపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, రైతు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ చెప్పారు. మంగళవారం రాత్రి ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. హోం మంత్రి అనిత ఇప్పటికే నియోజకవర్గంలోని వ్యవసాయశాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదనే ఆరోపణలను రైతులు విస్మరించాలన్నారు. బడ్జెట్‌లో కూడా రైతాంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గింజాల లక్ష్మణరావు, వైబోయిన రమణ, దార్ల కృష్ణ పాల్గొన్నారు.

రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి : ఏవో



రైతులతో మాట్లాడుతున్న ఏవో ఆదినారాయణ

పాయకరావుపేట రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ (భూ ఆధార్/రైతు గుర్తింపు సంఖ్య)చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ అన్నారు. మండలంలోని ఈదటం,పాల్మన్‌పేట గ్రామాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ గురించి అవగాహన కల్పించారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, శరత్, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

'ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి'



వైద్యాధికారికి వినతిపత్రాన్నిస్తున్న ఆశా కార్యకర్తలు

అచ్యుతాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఆశా వర్కర్లు మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రాన్నిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. అలాగే ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని కోరారు. దశల వారీగా ఆశా వర్కర్లకు ఏఎన్ఎం శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు మంగమ్మ, దుర్గ, సరోజిని, సూర్యలక్ష్మి, సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలి



తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్

పాయకరావుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పాయకరావుపేట పట్టణంతోపాటు మండలంలోని అరట్లకోట, నామవరం, గుంటపల్లి గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ.. ఇళ్లలో సేకరించిన చెత్తను కాలువలు, బయట ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడ్డి, పొడి చెత్తగా వేరుచేసి పారిశుధ్య సిబ్బంది వచ్చినపుడు అందజేయాలన్నారు. అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, ఇంటి పన్నుల వసూలు తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు.

స్టేట్‌బ్యాంక్ ఆవరణలో ఉచిత వైద్యశిబిరం

రాంబిల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో విశాఖ కేర్ ఆస్పత్రి వైద్యులు వంద మంది రోగులకు పరీక్షలు జరిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సత్య రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులను అందజేశారు. అప్తాలమిక్ సిబ్బంది కంటి పరీక్షలు చేసి, మందులను అందజేశారు. కార్యక్రమంలో కేర్ ఆసుపత్రి సిబ్బంది, స్టేట్‌బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

నేడు 9 గ్రామాలకు విద్యుత్ సరఫరా కట్

నక్కపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేస్తుండడంతో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్, ఏఈ కృష్ణ చెప్పారు. మండలంలోని చినదొడ్డిగల్లు, ముకుందరాజుపేట, రమణయ్యపేట, డొంకాడ, జి. జగన్నాథపురం, చీడిక, రేవెళ్ల కొత్తూరు, తిరుపతిపాలెం, దోసలపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా వుండదని చెప్పారు.

325 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎలమంచిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ములకలాపల్లి మైహోమ్ సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం నాలుగు పాఠశాలల్లో 325 మంది విద్యార్థులకు వైద్యులు పరీక్షలను నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పరిశ్రమ సీఎస్ఆర్‌లో భాగంగా పులపర్తి, కృష్ణాపురం, లక్ష్మవరం, గూండ్రుబిల్లి పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సీనియర్ జీఎం (ఆపరేషన్స్)బి.రామస్వామి, డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్. మేఘన, డాక్టర్. నరేష్, ధనుంజయ్, డీజీఎం(పీఅండ్ఏ)ఎల్. శ్రీనివాసరావు, ఓహెచ్‌సీ ఇన్‌చార్జి రాజు, సీఎస్ఓ డి.వెంకటరావు పాల్గొన్నారు.

సారా తయారు చేసినా, అమ్మినా నేరమే

▸▸ ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మున్నాయుడు

మునగపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసినా, విక్రయించినా నేరమే అవుతుందని అనకాపల్లి ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మునాయుడు హెచ్చరించారు. మండలంలో గంటవానిపాలెం గ్రామంలో మంగళవారం నవోదయం-2.0 కార్యక్రమం జరిగింది. ఎక్కడైనా సారా తయారు చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 14405కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గణేష్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్ఐలుగా విధుల్లో చేరిన బావ, బావమరిదికి డీఎస్పీ అభినందన



ఎస్ఐలుగా శిక్షణ పూర్తిచేసుకున్న నాని, దుర్గాప్రసాద్‌లతో డీఎస్పీ

నర్సీపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో సబ్ ఇన్‌స్పెక్టర్ శిక్షణ అనంతరం విజయనగరంలో విధుల్లో చేరిన రావికమతం మండలం పి.పొన్నవోలు గ్రామానికి చెందిన బావ, బావమరుదులైన పి.నాని, కె.దుర్గా ప్రసాద్‌లను నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు. ఎస్ఐ ఉద్యోగం పొందిన ఈ ఇద్దరు నర్సీపట్నం రిషి కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా సదరు కళాశాల సందర్శనకు మంగళవారం వీరు రాగా, కరస్పాండెంట్ కె.సతీష్ డీఎస్పీ వద్దకు తీసుకు వెళ్లారు. వీరి నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.వై.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సీపట్నం అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం నియోకవర్గంలో చిత్రాడ వేదికగా ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తుంచనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులంతా విజయవంతం చేయాల్సిందిగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం నర్సీపట్నంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తరువాత తొలి ఆవిర్భావ సభ కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని తరలి రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు

నాతవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్ధిపట్నం గ్రామంలో గల దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తుల తాకిడి ఆరంభమైంది. పసుపు, కుంకుమ, చీరలు వంటి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహా శివరాత్రి అనంతరం ఇక్కడి దుర్గామల్లేశ్వర ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి అన్నసమారాధన నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఏర్పాటైన ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.



ఆలయం వద్ద అన్నసమారాధన

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు

- మాకవరపాలెం మండలంలో రోలుగుంట మండలం కుసర్లపూడి వైసీపీకి చెందిన వ్యక్తి ఇష్టారాజ్యం
- గత ఐదేళ్లూ ఇదే తంతు.. కూటమి అధికారంలోకి వచ్చాక మరింత జోరు
- పట్టించుకోని అధికారులు



పెద్దిపాలెం ప్రభుత్వ భూమిలో చేపట్టిన మట్టి తవ్వకాలు

మాకవరపాలెం, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మట్టి తవ్వకాలు జోరందుకున్నాయి. రాత్రి సమయాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ఆనుకొని ఉన్న ప్రైవేటు స్థలాలను మట్టితో కప్పి కొందరు సొమ్ములు చేసుకుంటున్నారు. రోలుగుంట మండలం కూసర్లపూడి గ్రామానికి చెందిన ఒకవ్యక్తి గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల మాకవరపాలెం మండలంలో ఇష్టారాజ్యంగా ఇందుకు పాల్పడేవారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆతని మట్టి దందా ఆగలేదు. సరికదా.. మరింత పెరిగిపోయింది. అయితే ప్రభుత్వ కార్యాలయాలకు దగ్గరలో ఉన్న ప్రైవేటు స్థలాలు సెంటు రూ.10లక్షల నుంచి రూ.14లక్షల వరకు ధర పలుకుతున్నాయి. దీంతో పలుచోట్ల ఇటువంటి స్థలాల్లో మట్టి కప్పడం మరింత ఎక్కువైంది. పెద్దిపాలెం శివారులో సుమారు వంద ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో మట్టిని తవ్వి మండలంలో ఉన్న తామరం, మాకవరపాలెం, కొండల అగ్రహారం, లచ్చన్నపాలెం గ్రామాల్లో గల ప్రైవేటు స్థలాలకు తరలించారు. ఒక్కో ప్రైవేటు స్థలాన్ని మట్టితో చదను చేసేందుకు మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు ఒప్పందం కుదుర్చుకొని మట్టిని కప్పుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రామారావును వివరణ కోరగా, ప్రభుత్వ భూమిలో మట్టిని తరలిస్తున్నట్టు తెలిసిందన్నారు. మట్టి తవ్వకాలు జరుపుతున్న వారితో పాటు మట్టి కప్పిస్తున్న వ్యక్తులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



మాకవరపాలెంలో ఉన్న ప్రైవేటు స్థలంలో మట్టితో కప్పుతున్న దృశ్యం

క్షయ రహిత పంచాయతీలు ఎంపిక

మాకవరపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపాలెం, మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్యాల పరిధిలో నాలుగు పంచాయతీలు క్షయ రహిత పంచాయతీలుగా ఎంపికైనట్టు మాకవరపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సీతామహాలక్ష్మి తెలిపారు. జిల్లా నుంచి మంగళవారం వైద్య బృందం విచ్చేసి ఈ విషయాన్ని వెల్లడించారన్నారు. మాకవరపాలెం పీహెచ్‌సీ పరిధిలో బయ్యవరం, బీఎస్‌పేట, జడ్.గంగవరంతో పాటు బూరుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలో జి.గంగవరం పంచాయతీ ఎంపికైనట్టు చెప్పారు. ఈ నెల 24వ తేదీన వరల్డ్ టీబీ డే కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులకు అభినందన పత్రాలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు రామకృష్ణ, అయ్యప్ప, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



క్షయ రహిత పంచాయతీల ఎంపికపై వైద్య సిబ్బంది హర్షం

కూటమి ప్రభుత్వంలో పెడిమికొండ నర్సరీకి పూర్వ వైభవం

- ఐదేళ్ల వైసీపీ పాలనలో నిధులు కేటాయించక మొక్కల పెంపకం నిలిపివేత
- ప్రస్తుత ప్రభుత్వం రూ.మూడు లక్షలు కేటాయించడంతో పనులు



నర్సరీలో మొక్కల పెంపకానికి సంచులు సిద్ధం చేస్తున్న కూలీలు

నాతవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెడిమికొండ నర్సరీకి కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం రానుండడంతో అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెడిమికొండ రిజర్వు ఫారెస్టులో ఉన్న నర్సరీలో ఏటా 80వేల నుంచి 90 వేల వరకు అటవీశాఖ అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి వేప, నేరేడు, నల్లమద్ది, పనస, నీలగిరి, టేకు, గానుకు తదితర మొక్కలను పెంచేవారు. ప్రతి ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాకాలంలో రైతులకు ఉచితంగా ఈ మొక్కలను అందజేసేవారు. అలాగే నాతవరం మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అటవీశాఖ అధికారులు ఉచితంగా అందజేసేవారు. అయితే అప్పట్లో అటవీశాఖ అధికారులు అందజేసిన మొక్కలు నేడు ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దవై దర్శమిస్తున్నాయి అలాగే రైతుల పాకల దగ్గర కూడా టేకు, నీలగిరి చెట్లు కనిపిస్తున్నాయి. దీనివల్ల అటవీ సంపదకు వీరు తోడ్పాడ్డారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో పెడిమికొండ నర్సరీకి నిధులు కేటాయించ పోవడంతో ఇక్కడ మొక్కలు పెంపకం నిలిచిపోయింది. మొన్నటి వరకు బోసిపోయి కనిపించిన పెడిమికొండ నర్సరీకి మరలా పూర్వ వైభవం వచ్చింది. ప్రస్తుతం ఈకొండ నర్సరీలో మొక్కలు పెంపకానికి మూడు లక్షల రూపాయలను కూటమి ప్రభుత్వం కేటాయించింది. దీంతో అటవీశాఖ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు పెంపకానికి కూలీలు సంచులు సిద్ధం చేస్తున్నారు. నర్సరీలో నీటి సౌకర్యం ఎక్కువగా ఉండడంతో మొక్కలు పెంచి ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రైతులకు ఉచితంగా అందజేస్తామని చెపుతున్నారు. మొదటి దశలో 50వేల మొక్కలను పెంచనున్నామని అధికారులు వెల్లడించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



భీమబోయినపాలెంలో ఆవుకు టీకా వేస్తున్న డీడీ

మాకవరపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు పశు సంవర్థక శాఖ పాడేరు డీడీ నరసింహులు తెలిపారు. మండలంలోని భీమబోయినపాలెంలో మంగళవారం పశువులకు ఈ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి కుంటువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి పశువులకు సోకితే పాల దిగుబడి తగ్గడమే కాకుండా పలు సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ వ్యాధి పశువులకు సోకిన వెంటనే పశువైద్య కేంద్రాలను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఇదిలావుంటే, ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు విజయనగరం జిల్లా తోటపాలెంలో ఉత్తరాంధ్ర పాడి పశువుల పాల పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఔత్సాహిక పాడి రైతులు ఈ పోటీలకు పశువులతో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైదాధికారి డాక్టర్ అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

8న చమ్మచింతలో ఉచిత వైద్య శిబిరం

నాతవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ఎనిమిదో తేదీ శనివారం చమ్మచింత గ్రామంలో మహిళశక్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు శ్రేయోభిలాషి సంస్థ అధ్యక్షుడు నానాజీ తెలిపారు. నర్సీపట్నం మణి ఆసుపత్రి సహకారంతో శిబిరానికి హాజరయ్యే వారికి వైద్య పరీక్షలు జరుపుతామన్నారు. గైనకాలస్టు డాక్టర్ జేడీఎస్ నివేదిత, జనరల్ మెడిసిన్ వైద్యాధికారిణి జి.పావని హాజరు కానున్నారన్నారు. ఈ శిబిరాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు.


నూతన మోటారు యాక్ట్‌ను రద్దుచేయాలి



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

బుచ్చెయ్యపేట, మార్చి 4 (ఆంధ్ర జ్యోతి): నూతన మోటార్ యాక్ట్‌ను రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం వడ్డాదిలోని సినిమాహాల్ వద్ద శ్రీదేవి ఆటో సంఘం కార్మికులు నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి కింద ఆటోలు నడుపుతున్న తమపై చట్టం ప్రయోగించడం తగదన్నారు. వాహనమిత్ర రూ.15వేలు ఇస్తామని, భారీగా జరిమానాలు పెంచే జీవోనెంబరు 21, 31లను రద్దుచేస్తామని, డ్రైవర్‌లకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చి నేటివరకూ కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు వి.శేఖర్, ఆటో కార్మికులు టి.నూకరాజు, ఎ.రమణ, ఎస్.మావుళ్లు, ఎస్.రాము, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల విశ్వబ్రాహ్మణ కమిటీ ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన విశ్వబ్రాహ్మణ కమిటీ సభ్యులు

బుచ్చెయ్యపేట, మార్చి 4 (ఆంధ్ర జ్యోతి): మం డలంలోని రాజాం గ్రామంలోని మరి డిమాంబ ఆల యం వద్ద విశ్వ బ్రాహ్మణ మండల కార్యవర్గ సమా వేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సంఘం చోడవరం నియోజకవర్గ కన్వీనర్ చుక్క వెంకటసత్తిరాజు, కో కన్వీనర్ పెదపూడి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా బీమవరపు శ్రీను, సలహా సభ్యులుగా పంతం రామారావు, మండల కన్వీనర్‌గా కడియం శ్రీనివాస్, కో-కన్వీనర్‌గా ఎండపల్లి తులసీరావు, మండల ప్రెసిడెంట్‌గా చుక్క ఆచారి, మండల వైస్‌ప్రెసిడెంట్‌గా ఎండపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చుక్క లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా పొలిమూరి ఆనంద్. కోశాధికారిగా పాలవలన భాస్కరరావులను ఎన్నుకున్నారు.

ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన

బుచ్చెయ్యపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో వంద శాతం ప్రకృతి వ్యవసాయం మార్చేందుకు కొండపాలెం గ్రామాన్ని ఎంపికచేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మంగళవారం గ్రామంలో వ్యవసాయ శాఖ, వెలుగు, ప్రకృతివ్యవసాయ సిబ్బంది, పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు సర్వే మొదలుపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ముచ్చకర్ల భవానీ, తాతయ్యలు, ఎంపీవీ.సత్యనారాయణ, వ్యవసాయాధికారి భాస్కరరావు, ఏపీఎం రాజుబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

ప్రకృతి వ్యవసాయంతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బి.కింతాడ సర్పంచ్ బాబూరావు అన్నారు. ప్రకృతి సాగుతో భూసారం పెరగడంతో పాటు వ్యవసాయ పెట్టుబడులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శరగడం యశోద, కడిమినాగేశ్వరరావు, కొమర బాబూరావు, కొప్పాక శంకరరావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఈవో మాకొద్దు

- కొత్తకోట సర్పంచ్, ఉపసర్పంచ్
- కలెక్టర్, డీపీవోలకు ఫిర్యాదు చేయనున్నట్టు ప్రకటన

రావికమతం, మార్చి4 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ కొత్తకోట ఈవో జ్యోతి రెడ్డి విధి నిర్వహణలో అలసత్వంపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్టు ఆ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కోన లోవరాజు,పందల దేవా, ఎంపీటీసీ సభ్యులు పూడి దేవా, పైల చిన్నమ్మలు, పలువురు వార్డు సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఈవో ఖాళీ కుర్చీపై వినతిపత్రాన్ని పెట్టారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీలో పాలన పరమైన సమస్యలపై ఈవో జ్యోతిరెడ్డి నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని ఆరోపించారు. కార్యాలయానికి రాకుండానే అద్దె ఇంట్లో ఉంటూ కాలం గడిపేస్తున్నారని విమర్శించారు. ఈవో అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. మార్కెట్ యార్డు తరలింపుపై పాలకవర్గం తీర్మానాన్ని ఆమె అమలు చేయలేదన్నారు. అలాగే మూడో గ్రామ సచివాలయం గేట్‌కు ఎదురుగా ఉన్న గ్రామకంఠంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం నిర్వహణ గాలికొదిలేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఈవో జ్యోతిరెడ్డిని వివరణ కోరగా.. వారి ఆరోపణలు వాస్తవం కాదన్నారు. విధి నిర్వహణలో ఏనాడు అలసత్వం చూపలేదన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నానన్నారు. మండల కేంద్రంలో సమావేశాలుంటేనే ఆ రోజు అక్కడికి వెళుతున్నానని చెప్పారు.



ఈవో కుర్చీకి వినతిపత్రాన్ని ఇస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌లు

6న ఆశ కార్యకర్తలు చలో విజయవాడ

చోడవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీన వైఖరికి నిరసనగా ఈనెల 6న విజయవాడలో చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశ కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి బొద్దాన రామలక్ష్మి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించడంతో పాటు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా మార్చు చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పంద జీవోలను విడుదల చేయడంతోపాటు, ఏఎన్ఎం శిక్షణ పొందిన కార్యకర్తలకు పర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యాధికారి ఆశ కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో కె.వరలక్ష్మి, కె.తారకలక్ష్మి, సీఐటీయూ నాయకులు చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో..

డిమాండ్ల సాధనకు ఈనెల ఆరో తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆశా కార్యకర్తలు స్థాని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. చలో వియవాడ కార్యక్రమానికి ఆశాలందరూ తరలిరావాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.సంధ్య, రమణమ్మ, ఎస్. లోవలక్ష్మి, జె.జగ్గమ్మ, సీహెచ్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

ఘనంగా మాడుగుల మోదకొండమ్మ తీర్థం

మాడుగుల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మరికొంతమంది భక్తులు ఘటాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎండ్ల పరుగు పోటీలను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు నగదు బహుమతులను అందించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లిన అప్పలనాయుడిను కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధ శ్రీనివాసరావు, బీయరశెట్టి పైడియ్యనాయుడు, కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. దేవి ఆడిటోరియం, దుర్గాలమ్మ ఎన్టీఆర్ కళాక్షేత్రం, శతకం పట్టువద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



ఎడ్ల పరుగు పందేం పోటీలను ప్రారంభిస్తున్న బండారు అప్పలనాయుడు

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

చీడికాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కోరారు. మండలంలోని తురువోలు లో చొక్కాకుల భగవంతుడు, కంచి రాము పూరిళ్లు ఆదివారం దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం బాధితులను పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులకు రూ. పది వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొటకల అరుణ్‌కుమార్, లాలం శివకుమార్, చొక్కాకుల వెంకునాయుడు, గొల్లవిల్లి రాజబాబు, కురచా నారాయణమూర్తి, కాటిపాము రాజు పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బూడి ముత్యాలనాయుడు

ఉపాధి బిల్లులు చెల్లించాలని వినూత్న నిరసన



ఆకులు పట్టుకొని నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం బిల్లులను వెంటనే చెల్లించాలని ఆకులు పట్టుకొని గిరిజనులు వినూత్న నిరసన చేప ట్టారు. మంగళవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో నిరసన తెలిపారు. గత ఐదు వారాలుగా బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు పస్తులు ఉంటున్నారన్నారు. వేసవి అలవెన్సులు గతంలో ఇచ్చేవారని, ప్రస్తుతం లేవన్నారు. మెడికల్ కిట్లు, టెంట్లు వేయలేదన్నారు. 12న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

దేవరాపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను పశువైద్యాధికారి కె.మంజుషా రాణి వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఈ టీకాలు వేస్తున్నామన్నారు. ఈ వ్యాధి లక్షణాలు మూతి పుండ్లు రావడం, మేత తినకపోవడంతో మృతి చెందుతాయన్నారు. నాలుగు నెలలు పైబడిన పశువులకు అన్నింటికీ ఈ టీకాలు వేయవచ్చన్నారు.

ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధ వహించాలి

కె.కోటపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు కోరారు. మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు యోగా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రధాన మోదీ ఫిట్ ఇండియాని ప్రారంభించారన్నారు. కార్యకర్తలకు వివిధ రకాల యోగాసనాలను నేర్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎల్‌వీ సుశీల, ఎస్. కళ్యాణి, రాములమ్మ, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు భూపతి లక్ష్మి, డోకల కుమారి పాల్గొన్నారు.

10న పాపంపేటలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రోలుగుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతలం పంచాయతీ శివారు పాపంపేటలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 10న ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్.రాజు, హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్టు తెలిపింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ తెలిపింది.

అప్పలరాజుపురం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు

చీడికాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో అప్పలరాజుపురంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 6వ తేదీన జరగనుంది. స్థానిక సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, వందలాది మంది భక్తులు పూజలు చేశారు.

కోనాం గురుకులంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానం

చీడికాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ హిమాచల తెలిపారు. ఈ ఏడాది నాల్గవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఐదో తరగతిలో చేరేందుకు, అలాగే పది పూర్తయిన విద్యార్థులు ఇంటర్‌లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 6281180214, 9505058287 నంబర్లను సంప్రదించాలన్నారు.

మంత్రులను కలిసిన గిడ్డి ఈశ్వరి



మంత్రులు అనిత, సంధ్యారాణిలతో గిడ్డి ఈశ్వరి

పాడేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణిలను టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మంగళవారం అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఏజెన్సీలో పార్టీ వ్యవహారాలు, పలుకీలక సమస్యల ను మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆమె తెలిపారు.

9న ఆదివాసీ జేఏసీ సమావేశం

కొయ్యూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చింతూరు కేంద్రంగా ఈ నెల 9న ఏపీ ఆదివాసీ జేఏసీ విస్తృత సమావేశం జరుపనున్నట్టు జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొట్టడం రాజబాబు తెలిపారు. రాష్ట్రంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు చట్టాలు అమలులో జరుగుతున్న నిర్లక్ష్యం, వీటిపై పాలకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై చర్చిస్తామన్నారు. జీవో 3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం తీసుకురావాలని గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని, మరికొన్ని ముఖ్య సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తామన్నారు. జిల్లా పరిధి అన్ని డివిజన్ కమిటీలు, పె సా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు జేఏసీ బాగస్వామ్య సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

జాతీయ రహదారి పనుల్లో నిర్లక్ష్యం తగదు

» ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆగ్రహం



కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

జి.మాడుగుల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పాడేరు జిల్లా కేంద్రం మీదుగా జరుతున్న జాతీయ రహదారి 916 ఈ పనుల్లో నిర్లక్ష్యం తగదని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సంబంధిత కాంట్రాక్టర్‌పై ఆ గ్రహం వ్యక్తంచేశారు. ప్రధానంగా జి.మాడుగుల మండల కేంద్రం నుంచి పాడేరు వరకు జరుగు రహదారి పనుల్లో మట్టిని రోడ్డులో వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. దుమ్ము, ధూళి లేవడంతో వాహనాల దారులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. గతంలో ఎన్నోసార్లు ఈ విషయం కాంట్రాక్టర్‌కు తెలిపినా చర్యలకు ఉపక్రమించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా రోడ్డు పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందుల లేకుండా చూడాలని హెచ్చరించారు. లేని పక్షంలో స్థానిక ప్రజలతో కలిసి నిరసనలు తెలుపుతామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి శిక్షణకు మినుములూరు సర్పంచి ఎంపిక



సర్పంచి చిట్టమ్మ

పాడేరురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రా మీణాబివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6వ తేదీలలో గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమానికి పాడేరు మండలం మినుములూరు పంచాయతీ సర్పంచ్ లంకెల చిట్టమ్మను ఆదర్శ మహిళా స్నేహపూర్వక పంచాయతీ (డబ్ల్యూఎఫ్ జీపీ) సర్పంచిగా ఎంపిక చేశారు. ఈ శిక్షణలో మహిళా నాయకత్వం, పాలనలో బాగస్వామ్యం, గ్రామాబివృద్ధిలో మహిళల పాత్ర తదితర అంశాలను వివరిస్తారన్నారు.

'గాదె' గెలుపుపై సంబరాలు



డుంబ్రిగుడలో కేక్ కట్ చేస్తున్న పిఆర్‌టీయూ నేతలు

డుంబ్రిగడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసుల నాయుడు గెలుపుపై పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంబరాలు చేశారు. కేక్ కట్‌చేసి పంచారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ గాదె సహకరించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గెన్ను నాయకులు ధర్మ, చిన్ని, రాంప్రసాద్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

గూడెంకొత్తవీధి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రత పాటించాలని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం జీకే వీధి గ్రామ సచివాలయం పరిధిలో ఇంటింటికీ తడి, పొడి చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.



సంతలో వ్యాపారుల పందిళ్లు



శిథిల స్థితిలో మరుగుదొడ్లు

సంతలో నీడ కరువు

» హుకుంపేటలో వ్యాపారులు, రైతుల అవస్థలు
» పదేళ్ల కిందట తుఫాన్‌కు రేకుల షెడ్లు శిథిలం
» ఆసీలతో ఆదాయం.. కనీస సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం

హుకుంపేట మార్చి 4 ఆంధ్రజ్యోతి; మండల కేంద్రమైన హుకుంపేట వారపు సంతలో షెడ్లులేక చిరువ్యాపారులు, గిరిజన రైతులకు ఎండా, వానలనుంచి రక్షణ కరువై తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గతంలో నాబార్డ్ నిధులతో సంతలో షెడ్ల నిర్మాణాలు జరిగినా.. అవి పదేళ్ల కిందట వచ్చిన హుదూద్ తుఫాన్‌కు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు తిరిగి షెడ్ల నిర్మాణాలకు అధికారులు, నాయకులు ఎటువంటి చర్యలు చేపటట్టలేదు. ఇక్కడ ప్రతి శనివారం సంత జరుగుతోంది. ఈ సంతకు సరిహద్దునున్న ఒడిశా, విశాఖ ఉమ్మడి జిల్లాలోని పలువురు వ్యాపారులు రైతులు వస్తుంటారు. భారీ సంఖ్యలో దినుసులు వి క్రయాలు జరుతుంటాయి. చిరు వ్యాపారులు చిన్నచిన్న టార్పాలిన్, ప్లాస్టిక్ పరదాలతో ఏర్పాటు చేసిన పాకల్లో ఉంటూ వ్యాపారాలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో తమ వస్తువులు తడిచి పోతున్నాయి. గాలులు వీచే సమయంలో భయాందోళన మధ్య విక్రయాలు చేస్తున్నారు. ఎండ కాలంలో ఉదయం సాయంత్రం వరకు మరీ సమస్య ఎదుర్కొంటున్నారు. సంతలో షెడ్లు నిర్మించాలని సంబంధిత అధికారులకు కోరుతున్నా పంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. ఏటా ఆశీల ద్వారా ఆదాయం రూ. లక్షల్లో వస్తున్నా సంత అభివృద్ధికి రూపాయి వెచ్చించడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కనీసం తుఫాన్‌కు దెబ్బతిన్న షెడ్లకు మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు. అలాగే, మరుగుదొడ్ల సదుపాయం మెరుగుపరచాలని అభ్యర్థిస్తున్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

» ఏకలవ్య పాఠశాల ఎదుట తల్లిదండ్రులు ఆందోళన



ఈఎంఆర్ఎస్ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు

చింతపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులను అమానుషంగా దండించిన ఉ పాధ్యాయులుపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక పాఠశాల ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా బాధిత విద్యార్థి తండ్రి కిల్లో పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులపై దాడిచేసిన అకౌంటెంట్, ముగ్గురు ఉపాధ్యాయులపై గురుకులం, నెస్ట్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంఘటన ఫిబ్రవరి 11న జరిగితే అధికారులు విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారే తప్పా కనీస చర్యలు తీసుకోలేదన్నారు. కలెక్టర్ స్పందించి విద్యార్థులపై అమానుషంగా దాడి చేసిన ముగ్గురు ఉపాధ్యాయులు, అకౌంటెంట్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సైలు వెంకటేశ్వరరావు, వెంకటరమణ పాఠశాలకు చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నారని వివరించారు. కాగా పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ అమరావతి నెస్ట్, గురుకులం అధికారి కృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడారు. దీంతో ఆయన రెండు రోజుల్లో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించి ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కొర్ర కృష్ణ, పూర్ణరావు, త్రినాథ్ పాల్గొన్నారు.

సచివాలయాల పరిధిలో సర్వేలు వేగవంతం: జేసీ

పాడేరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి జరుగుతున్న సర్వేలను వేగవంతం చేయాలని జా యింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ అన్నారు. జిల్లాలో సర్వే ప్రక్రియలపై వివిధశాఖల అధికారులతో ఆయన మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎంఎస్ఎంఈ, మిస్సింగ్ సిటిజన్స్, ఆధార్ నమోదు, జనన, మరణాలు, స్కూల్ టాయిలెట్లు, తదితర సర్వేలను నిర్దిష్ట సమయానికి పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం తాజాగా ఆదేశించిన పీ4 సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యంతో సాగితే ఉన్నత శిఖరాలు

కొయ్యూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు సాధ్యమని వైఎస్ఆర్, టీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తేడబారికి సురేశ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలో డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్లాంక్‌లతో పాటు పరీక్షకు అవసరమైన తదితర సామగ్రిని సురేశ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షలలో విద్యార్థులు అవలంబించాల్సిన విధి విధానాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రభుదాస్, జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, సిబ్బంది జేవీ గిరిబాబు, హరిదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి

చింతపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో అగ్నిప్రమాదాలు నియంత్రించేందుకు గిరిజనులు సహకరించాలని స్థానిక రేంజ్ అధికారి ఎ. అప్పారావు కోరారు. మంగళవారం చింతపల్లి రేంజ్ పరిధిలోని కొండసంత, చినకిల్తారి, పద్మాపురం, రొబ్బసింగి, దామనాపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోనే గిరిజనుల అవగాహన లేమితో అత్యధికంగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అడవులకు వెళ్లిన గిరిజనులు ఎక్కడా మంట పెట్టరాదన్నారు. అవసరమై పెట్టినా వెంటనే ఆర్పివేయాలన్నారు. అగ్ని ప్రమాదాల వల్ల వృక్షసంపద, అడవు జంతువుల కు తీవ్ర హాని కలుగుతుందన్నారు. ప్రస్తుతం అడవుల్లో ఉద్యోగులు ఫైర్ లైన్ క్లియరెన్సు పనులు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వెంకటరాజు, అటవీశాఖ ఉద్యోగులు, గిరిజనులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణతోనే మనుగడ

సీలేరు: అడవులకు నిప్పు పెట్టడంతో కలిగే అనర్థాలపై జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధి కుమ్మరాపల్లి గ్రామంలో మంగళవారం అటవీశాఖ అధికారులు గిరిజనులకు అవగాహన కల్పించారు. సీలేరు మండలం ధారకొండ సెక్షన్ ఆఫీసర్ సతీశ్ గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. ప్రస్తుతం ఆకులు రాల్చే కాలమైనందున గిరిజనులు అడవులకు వెళ్లినప్పుడు నిప్పు పెట్టరాదన్నారు. అడవులు ఆహుతైతే పర్యావరణానికి ముప్పు వాటిల్లి మానవుని మనుగడకే ప్రమాదకమన్నారు. నిప్పు పెట్టడంతో వన్య ప్రాణులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. అలాగే సంప్రదాయాలు పేరిట వన్య ప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల సమీపంలో ఎక్కడైనా అడవులు తగులబడితే వెంటనే సమీప అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ధారకొం డ ఏబీఓలు సాగిన సత్యనారాయణ, కె ప్రకాశ్, బేస్ క్యాంప్ సి బ్బంది పాల్గొన్నారు.



కొండసంతలో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

మిల్లెట్స్ మేళాలో మత్స్యదేవత ఎఫ్‌పీవోకు అవార్డు



ప్రశంస పత్రాలందుకుంటున్న హనుమంతరావు

జి.మాడుగుల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) :హైదరాబాద్‌లో ఈ నెల 3, 4 తేదీలలో జరిగిన ఐఐఎంఆర్ మిల్లెట్స్ కిసాన్ మేళాలో జి.మాడుగుల మం డలం మత్స్యదేవత ఎఫ్‌పీవోకు ఉత్తమఅవార్డు దక్కినట్టు ఎఫ్‌పీ వోల సీఈవో హనుమంతరావు, శేఖర్ తెలిపారు. ఈ మేళాకు ఏపీతోపాటు తెలంగాణ, కర్ణాటకలనుంచి రైతులకు పాల్గొనగా, తమ ఎఫ్‌పీవోకు బెస్ట్ రావడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని శాస్త్రీయ సాగు, చిరు ధాన్యాల ఉత్పత్తులు చేపడతామని వారు చెప్పారు.

సకాలంలో టీబీ నిర్ధారణ పరీక్షలు: డీఎంహెచ్‌వో



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమీల్ బాషా

పాడేరురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): టీబీ లక్షణాలను స కాలంలో గుర్తించి రోగులకు కళ్లె (కఫం) పరీక్షలు చేయించగలిగితే వ్యాధి నియంత్రణ సాధ్యమవుతుందని డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని మారుమూల ఈదులపాలెం పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఆస్పత్రిలోని వార్డులను, అందుబాటులో ఉ న్న మందులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో జరుగుతున్న ఆశ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మాతా శిశు మరణాల, హైరిస్క్ గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగితెలుసుకున్నారు. టీబీ నిర్ధారణ ˘అ నంతరం రోగికి ప్రభుత్వం పౌష్టికాహారం కోసం ప్రతీ నెల రూ. 1,000 చొప్పున ఆరు నెలల వరకు అం దిస్తుందన్నారు. గిరిజన ప్రాంత రోగులకు అదనంగా మరో రూ. 750 ఇస్తున్నట్టు చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీను, డాక్టర్.నర్సింహ, జిల్లా టీబీ కో- ఆర్డినేటర్ పాంగి శేషగిరి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ సదానంద, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ధనరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



యోగా సాధనలో విద్యార్థినులు, మహిళలు

అనంతగిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నేచర్ సంస్థ ఆ ధ్వర్యంలో సమావేశం మంగళవారం నిర్వహించారు. అదనపు సీడీపీవో అచ్యుతాంబ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళల శక్తి సామర్థ్యాలు అపారమైనవని గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ స్ఫూర్తిదాయకంగా మెలగాలన్నారు. అనంతరం మహిళలు, విద్యార్థినులతో యోగా సాధన చేయించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



అపస్మారక స్థితిలో యువకుడు

జి.మాడుగుల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : జి.మాడుగుల- పాడేరు ప్రధాన రహదారి కె.కోడాపల్లి పంచాయతీ గన్నెరుపుట్టు సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గా యాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. సోలభం పం చాయతీ గొడుగురాయికి చెందిన వంజరి భాస్కర్‌రావు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారంతో సంఘటనా స్థలానికి వారు వచ్చి భాస్వరరావును ఓ ప్రైవేటు వాహనంతో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారి పనుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సోషల్ మీడియాపై స్వీయ నియంత్రణ అవసరం



మహిళా దినోత్సవ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ గోవిందరావు

పాడేరురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా సోషల్ మీడియా స్వీయ రక్షణ, పని ప్రదేశంలో భద్రత, బహిరంగ ప్రదేశాలలో రక్షణ తదితర అంశాలపై కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ కె.గోవిందరావు మాట్లాడుతూ సోషల్ మీడియా స్వీయరక్షణకు విద్యార్థులు ఎలా మెలగాలో వివరించారు. ఈ అంశాలపై డిబెట్ పోటీలనునిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎం.శిరీష (ప్రథమ), సీహెచ్.నాగేంద్ర (ద్వితీయ), డి.సువర్ణ (తృతీయ)బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు జి.గౌరీశంకరరావు, వి.రమేశ్‌బాబు, ఐక్యూఎస్సీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, మ హిళా సాధికారిక కన్వీనర్ పి.ఔజన్య, కె.నిర్మల, టి.సుమిత్ర, ఈవీ.జయలక్ష్మి, వరిజ, జి.గోవిందరాజు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మహిళల హక్కులు, చట్టాలను కాపాడుకోవాలని స్థానిక సీడీపీవో లక్ష్మిదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామలక్ష్మి, మోహిని, వలసమ్మ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గంగమ్మతల్లి ఉత్సవాలు



కొలువుదీరిన గంగమ్మతల్లి ప్రతిమలు

ముంచంగిపుట్టు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుజనకోటలో రెండురోజుల పాటు నిర్వహించిన గంగమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. తొలి రోజు సోమవారం రాత్రి జాతర నిర్వహించి పలు రకాల సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారికి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ భక్తులకు ఏర్పాట్లు చేశారు. ముంచంగిపుట్టుకు చెందిన కిరాణా వ్యాపారి గు డ్ల వెంటకరమణ, శ్రీనివాసరావు బ్రదర్స్ భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర గంగమ్మతల్లిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు.

తాజంగి దొంతులమ్మ ఉత్సవాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చింతపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగిలో దొంతులమ్మ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన జాతరకు పలు గ్రామాల భక్తులు తరలి వచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ జాతర బుధవారంతో ముగియనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 93 శాతం హాజరు

పాడేరురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు డీఐఈవో ఎల్.అప్పలరామ్ తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలోని 26 పరీక్ష కేంద్రాలలో జనరల్ గూపు విద్యార్థులు 6,773 మంది హాజరు కావాల్సి ఉండగా 6,324 (93 శాతం) మంది హాజరుకాగా, మిగిలిన 449 మంది గైర్హాజరయ్యారన్నారు. అదే విధంగా జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే ఒకేషనల్ గ్రూపు విద్యార్థులు 1,355 మంది హాజరు కావాల్సి ఉండగా 1,154 (85 శాతం) 201 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఆయన తెలిపారు.

పాడేరులో...

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో జరిగిన ఈ పరీక్షకు 8 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన జనరల్ గ్రూపు విద్యార్థులు 179 మంది హాజరు కావాల్సి ఉండగా 171 (95 శా తం)మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ గ్రూపు విద్యార్థులు 417 మందికి 387 (92 శాతం)మంది హాజరుకాగా 30 మంది గైర్హాజరైనట్టు పరీక్ష కేంద్రం చీఫ్‌సూపరింటెండెంట్ చీపురు రమాదేవి తెలిపారు.

కనీస వేతనాల కోసం ఆశ కార్యకర్తల నిరసన

ముంచంగిపుట్టు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలకు కనీస వేతనం జీవోను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరావు అన్నారు. ఈమేరకు మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు లబ్బూరు పీహెచ్‌సీ ఆవరణలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 6వ తేదీన ఛలో విజయవాడ మహా ధర్నా కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

రీ సర్వేపై అవగాహన అవసరం

పెదబయలు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వేకు ప్రజలు సహకరించాలని రీ సర్వే డీటీ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన లింగేటి పంచాయతీ పరధిలోని మొయ్యలగుమ్మి గ్రామంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీ, గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో ఏళ్ల తరబడి ఉన్న భూ తగాదాలు పరిష్కారమవుతాయన్నారు. ఆయన వెంట సిబ్బంది కృష్ణమూర్తి, వీఆర్‌వోలు, వీఎస్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

అనంతగిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో కిశోరీ వికాసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఐసీడీఎస్ పీవో సంతోషికుమారితో కలిసి, సచివాలయం మ హిళ పోలీసులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. కిశోరి వికాసం ముఖ్య ఉద్దేశం.. బాల కార్మికులు, బాల, బాలికలు అక్రమ రవాణా లేకుండా చూడడంతో పాటుగా బాల్యవివాహాల నిరోధం, డ్రాపౌట్ లేకుండా చూడాలన్నారు. సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

అందుబాటులో రిజిస్ట్రేషన్ సేవలు

పాడేరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వాసులు రిజిస్ట్రేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన చట్టాలకు లోబడి భూములు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. సొసైటీలు, సంస్థలు, వివాహాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గతానికి భిన్నంగా ప్రస్తుతం పాడేరు, రంపచోడవరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోని అన్ని రకాల రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రత్యేక చట్టాలకు లోబడి ఆయా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని సూచించారు.

పెరుగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

జీకేవీధిలో 13.4, అనంతగిరిలో 22.3 డిగ్రీలు నమోదు

పాడేరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఫలితంగా ఎండ ప్రభావానికి పొగమంచు తగ్గుముఖం పడుతున్నది. దీంతో మంగళవారం జీకేవీధిలో 13.4 డిగ్రీలు,అనంతగిరిలో 22.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగాజి.మాడుగులలో 13.8, అరకులోయలో 14.2, డుంబ్రిగుడ, చింతపల్లిలో 14.5, పెదబయలులో 14.8, పాడేరు, ముంచంగిపుట్టులో 15.2, హుకుంపేటలో 15.8, కొయ్యూరులో 18.9, అనంతగిరిలో22.3 డిగ్రీలకనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కాఫీ సబ్ రిటైర్డ్ అసిస్టెంట్ మృతి

గూడెంకొత్తవీధి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు రిటైర్డ్ సబ్ అసిస్టెంట్ సేవా చిన్నబ్బాయి (68) అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మండలంలోని వంచుల గ్రామ పంచాయతీకి చెందిన సేవా చిన్నబ్బాయి 8 ఏళ్ల క్రితం సబ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందారు. చిన్నబ్బాయి భార్య ఈశ్వరమ్మ టీడీపీలో సీనియర్ నాయకురాలిగా పనిచేస్తున్నారు.టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, సీనియర్ నాయకులు శెట్టి నాగేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.త

పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

▸ 'సింహాద్రి' హెచ్‌వోపీ సమీర్‌శర్మ



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న హెచ్‌వోపీ సమీర్‌శర్మ

పరవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాని సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు (హెచ్‌వోపీ) సమీర్ శర్మ సూచించారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సింహాద్రికి చెందిన దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉద్యోగులతో పాటు కార్మికులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రతపై అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈనెల పదో తేదీ వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థకు చెందిన వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు, దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పైడిమాంబ గరగ ఉత్సవం ప్రారంభం



అమ్మవారి గరగ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పరవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో ఈ నెల తొమ్మిదవ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న పైడిమాంబ జాతరలో భాగంగా గరగ ఉత్సవం ప్రారంభమైంది. సోమవారం రాత్రి అమ్మవారి గరగను పెద్దింటి నుంచి తీసుకొచ్చి గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గరగ ఊరేగింపు ఉత్సవం చివరి రోజు జరిగే అనుపోత్సవంతో ముగుస్తుందని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనువాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్‌ల సేవలు అభినందనీయం



లైన్‌మెన్‌లను సత్కరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ

కశింకోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో అంతర్జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈఈ ఎస్.రామకృష్ణ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేస్తున్న లైన్‌మెన్‌ల సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో తగిన భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. అంతకుముందు విధి నిర్వహణలో ఉంటూ అశువులుబాసిన లైన్‌మెన్‌లకు సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీర్ జె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికుల ఆందోళన

అనకాపల్లి టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూఏ ప్రతినిధులు ఇక్కడి ఆర్టీసీ డిపో ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం దీక్షా శిబిరంలో యూనియన్ నాయకుడు బి.నీలకంఠ మాట్లాడుతూ తాము చేసే దీక్షలు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, చట్టబద్ధంగా ఆర్టీసీ ఎండీ ఇచ్చిన ఆదేశాల ప్రకారం 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయడం కోసమని పేర్కొన్నారు. సస్పెన్షన్‌కు గురైన డ్రైవర్, కండక్టర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకరరావు, నారాయణ, ఎల్‌వీఆర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది నుంచి రెండు గ్రామాల్లో అమ్మవార్ల జాతర్లు



పైడిమాంబ జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పరవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో పైడిమాంబ, తానాంలో పరదేశిమాంబ అమ్మవార్ల జాతర్లు ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆయా గ్రామాల్లో ఆవిష్కరించారు. ఈ మూడు రోజులూ పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కావాల్సిందిగా కోరారు. మాజీ జడ్పీటీసీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ పైలా శ్రీనువాసరావు, పైలా సన్యాసిరావు, కన్నూరు వెంకటరమణ, చుక్క రామునాయుడు, రెడ్డి శ్రీనువాసరావు, కృష్ణారావు, రామారావు, బండారు రామారావు, రామచంద్రరావు, కూండ్రపు సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బడిలో భయం..భయం..

▸ శిథిలావస్థలో ఊటగెడ్డపాలెం ఎంపీపీ పాఠశాల భవనం

▸ శ్లాబ్ నుంచి ఊడి పడుతున్న పెచ్చులు
▸ కిటికీలు, తలుపులకు చెదలు.. పాడైన గచ్చులు
▸ పిల్లలను చదువుకు పంపించాలంటే తల్లిదండ్రులు ఆందోళన

పరవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ ఊటగెడ్డపాలెంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 40 ఏళ్ల క్రితం దీన్ని నిర్మించారు. గత రెండు మూడేళ్లగా భవనం పరిస్థితి రోజు రోజుకు అధ్వానంగా తయారవుతోంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పదిహేడు మంది ఉన్నారు. వీరందరికీ ఒక్కరే టీచర్ బోధన చేస్తున్నారు. ఈ భవనం శిథిలం కావడంతో విద్యార్థులతో పాటు టీచర్ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తరగతి గది లోపల శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో విద్యార్థులందరినీ వరండాలో కూర్చొబెట్టి బోధన చేస్తున్నారు. భవనం సన్‌షెడ్ పూర్తిగా ధ్వంసమైంది. కిటికీలు, తలుపులు చెదలు పట్టాయి. గచ్చులు పాడయ్యాయి. ఇన్ని అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువులను కొనసాగిస్తున్నారు. తలుపులు సక్రమంగా లేకపోవడం వల్ల లోపల గల విద్యా సామగ్రి దొంగలపాలయ్యే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయిని విజయ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వర్షాల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. శ్లాబ్ కారిపోతుండడంతో రికార్డులు తడిసి ముద్దవుతున్నాయి. విద్యాబోధన కూడా సక్రమంగా కొనసాగలేని దుస్థితి నెలకొంటుంది. భవనం దుస్థితి దారుణంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.



పాఠశాల భవనం శిథిలావసకు చేరడంతో వరండాలోనే పాఠ్యాంశాలు భోదిస్తున్న టీచర్



చెదలు పట్టిన కిటికీ



శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్న దృశ్యం

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి



పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మూడేళ్లగా అవస్థల మధ్య చదువులు కొనసాగుతున్నాయి. దీనివల్ల పిల్లలను పాఠశాలకు పంపించాలంటేనే భయంగా ఉంది. అధికారులు స్పందించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలి.

- కె.నాయుడు, ఊటగెడ్డపాలెం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాల భవనం పరిస్థితిని జిల్లా ఉన్నతాధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లాం. అలాగే మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా పంపించాం. తొందర్లోనే నిధులు మంజూరు చేయించి, భవనానికి మరమ్మతులు చేపడతాం.

- ఎం.దివాకర్‌రావు, ఎంఈవో

పంచాయతీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

▸ డీపీవో శిరీషారాణిని కోరిన పట్టణ సీఐ విజయ్‌కుమార్



డీపీవో శిరీషారాణికి లేఖ అందిస్తున్న సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మూడు గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్.శిరీషారాణిని సీఐ టీవీ విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమెను కలిసి ఓ లేఖను అందజేశారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తుమ్మపాల, కొత్తూరుతో పాటు సత్యనారాయణపురం పంచాయతీలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలోని ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలను పంచాయతీ నిధుల ద్వారా ఏర్పాటు చేయాలని విన్నవించారు. పంచాయతీల పరిధిలో ఎటువంటి నేరాలు, ఘర్షణలు జరిగినా అందుకు కారణమైన వారిని వెంటనే గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టాల్సిందిగా ఆయన కోరారు. సీఐ వెంట ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు ఉన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



మాట్లాడుతున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈ నెల ఎనిమిదో తేదీన జరగనున్న నేపథ్యంలో కశింకోట పోలీసుల ఆధ్వర్యంలో ఇక్కడి సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అల్లు స్వామినాయుడు మాట్లాడుతూ మహిళల హక్కులు, మహిళా సాధికారత, సమానత్వం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ ఉత్సవం



పరవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి పంచాయతీ ఫార్మా పునరావాస కాలనీలో పోలమాంబ పండుగ మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఘటాలు గ్రామ పుర వీధుల్లో ఊరేగించిన అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు.

డంపింగ్ యార్డు వద్ద షెడ్డు వద్దే వద్దు

▸ ఆందోళన చేపట్టి నిర్మాణాన్ని అడ్డుకున్న జనసేన నాయకులు

అనకాపల్లి టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న డంపింగ్ యార్డు వద్ద షెడ్డు నిర్మాణాన్ని చేపట్టేందుకు అధికారులు తీసుకున్న చర్యలకు జనసేన నాయకులు అభ్యంతరం తెలిపారు. కంపోస్టుయార్డు ప్రాంతంలో షెడ్డు నిర్మాణానికి మెటీరియల్‌ను అధికారులు సిద్ధం చేయడాన్ని తెలుసుకున్న సదరు నాయకులు మంగళవారం రాత్రి డంపింగ్‌యార్డు వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు దూలం గోపి మాట్లాడుతూ డంపింగ్‌యార్డు వద్ద షెడ్డు నిర్మాణం చేపట్టరాదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఎన్నికల హామీలో కంపోస్టు యార్డును దూర ప్రాంతాలకు తరలిస్తామని హామీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో అధికారులు చెత్త వేసిన ప్రాంతంలో షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం తగదన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతవాసులు చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న కంపోస్టుయార్డును దూర ప్రాంతాలకు తరలించాలని ఎమ్మెల్యే కొణతాల చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జనసేన నాయకులు పీలా నాగశ్రీను, ఆళ్ల రామచంద్రరావు, మంగ ఈశ్వరరావు, బుద్ధ శ్రీను, కొణతాల మాధవ, దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్‌యార్డు వద్ద నిరసన తెలియజేస్తున్న జనసేన నాయకులు

30 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న డాక్టర్ సంధ్య

సబ్బవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 30వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఉచితంగా వేస్తామని గుల్లేపల్లి పశు వైద్యశాల ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ సంధ్య తెలిపారు. గుల్లేపల్లిలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ప్రాంభించి మాట్లాడారు. రైతులంతా తమ పశువులకు ఈ టీకాలు వేయించుకోవాలన్నారు. పశువులకు సంబంధించి ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే సమీపంలోని పశువైద్య శిబిరాన్ని సంప్రదించాల్సిందిగా సూచించారు. అనంతరం పశు పోషణలతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య శాల సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

కశింకోటలో కదలని మురుగు

▸ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కాలువల్లో తిష్ఠ
▸ ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడద
▸ ఇబ్బందులు పడుతున్న జనం.. పట్టించుకోని పంచాయతీ



కశింకోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కశింకోట ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కాలువల్లో మురుగు తిష్ఠ వేసింది. ఎక్కడికక్కడ ప్లాస్టిక్ గ్లాసులు, మద్యం బాటిళ్లు, చెత్తాచెదారాన్ని పారబోయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాల్సి ఉన్నా ఆ దిశగా పంచాయతీ అధికారులు దృష్టి సారించడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటికితోడు కాలువలపై పలకలు వేసి ఉండడంతో మురుగు ముందుకు పారని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే పంచాయతీ పాలకులు దృష్టిసారించాల్సిందిగా అంతా కోరుతున్నారు. ఇదిలావుంటే, కశింకోట బజారు వీధిలో ప్రతి వారం జరిగే సంతకు వచ్చే వ్యాపారులు కూరగాయల వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని కాలువలో పారబోస్తుండడంతో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతాల్లో డస్టు బిన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు చెత్తను వాటిలో వేసేలా వ్యాపారులను చైతన్యపరిస్తే సమస్య కొంత వరకు పరిష్కారమవుతుందని అంటున్నారు. ఈ దిశగా అధికారులు కృషి చేయాల్సిందిగా కోరుతున్నారు.



ప్రధాన రోడ్డులో ఉన్న కాలువలో ముందుకు పారని మురుగు

'భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి'

తుమ్మపాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కోన లక్ష్మణ కోరారు. మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమబోర్డుపై తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందని ఆరోపించారు. ఈ కారణంగా లక్షలాది మంది కార్మికులు నష్టపోయారన్నారు. వేలాది క్లెయిమ్‌లు చెల్లింపులు జరగక కార్మికుల కుటుంబాలు అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 42వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. గతంలో బోర్డు నుంచి దారి మళ్లించిన నిధులను సంక్షేమ బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఐపీఎల్‌కు స్టేడియం ముస్తాబు

మారుతున్న ఏసీఏ-వీడీసీఏ స్టేడియం రూపురేఖలు

- డ్రెసింగ్ రూమ్స్, కార్పొరేట్ బాక్స్‌లలో ఆధునిక సౌకర్యాలు
- మరింత ప్రకాశవంతంగా వెలగనున్న ఫ్లడ్ లైట్లు
- శరవేగంగా ఆధునికీకరణ పనులు

(విశాఖపట్నం స్పోర్ట్సు, ఆంధ్రజ్యోతి):

ఐపీఎల్ మ్యాచ్‌లకు మరోసారి వేదికగా నిలుస్తున్న పీఎంపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఆధ్వర్యంలో రూ.కోట్ల వ్యయంతో చేపడుతున్న ఆధునికీకరణ పనులతో స్టేడియం రూపురేఖలు మారనున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ హోం గ్రౌండ్‌గా ఈనెల 24న ఢిల్లీ క్యాపిటల్స్-లక్నో సూపర్ జెయింట్స్, ఈనెల 30న ఢిల్లీ క్యాపిటల్స్-సన్ రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేశారు.

స్టేడియం ప్రధాన ముఖద్వార భవనం ఎదుట ఎలివేషన్ పూర్తిగా మారనుంది. భవనానికి రంగులద్దడమే కాకుండా ఇంటర్నేషనల్ స్టేడియాలను తలపించేలా ముందు భాగాన్ని మారుస్తున్నారు. లోపలికి ప్రవేశించిన వెంటనే లాబీలో క్రికెట్ లోగోల వాల్ క్రాఫ్ట్‌తో కొత్త కళ తీసుకువచ్చారు. లాబీలోకి వెళ్లిన వెంటనే కొత్త అనుభూతి కలిగే విధంగా మార్పులు చేపడుతున్నారు.

కాంతులీననున్న ఫ్లడ్‌లైట్లు

స్టేడియంలోని ఫ్లట్‌లైట్లు మరింత కాంతివంతంగా ప్రకాశించనున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ రంగంలో వినియోగిస్తున్న అత్యాధునిక ఫ్లడ్‌లైట్లను ఈ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఫిలిప్స్ కంపెనీతో రూ.8 కోట్లకు కాంట్రాక్టు కుదుర్చుకుని లైటింగ్ పనులు పూర్తి చేసినట్టు తెలిసింది. కాంతివంతమైన ఫ్లడ్‌లైట్లను అమర్చడంలోనే కాకుండా వాటి నిర్వహణలో కూడా ప్రపంచ వ్యాప్తంగా ఫిలిప్స్ కంపెనీ ప్రథమస్థానంలో ఉన్న నేపథ్యంలో ఏసీఏ ప్రతినిధులు ఖర్చుకు వెనుకాడకుండా స్టేడియంలోని ఫ్లడ్‌లైట్స్ ఆదునికీకరణ బాధ్యతను ఫిలిప్స్ కంపెనీకి అప్పగించారని సమాచారం. దీంతో ఈనెల 24, 30న జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లను వీక్షించే అభిమానులకు ఫ్లడ్ లైట్స్ వెలుగులు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి.

మారిన డ్రెసింగ్ రూమ్స్

ప్రతి అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆటగాళ్ల డ్రెసింగ్ రూమ్స్‌లో చిన్నచిన్న మార్పులు చేసేవారు. కొత్త కార్యవర్గం అనవసర ఖర్చులకు తావివ్వకుండా పూర్తిస్థాయిలో అత్యాధునిక సదుపాయాలతో డ్రెసింగ్ రూమ్‌లను ఆధునికీకరిస్తున్నారు. ప్రతి ఆటగాడు తన కిట్ బ్యాగ్‌ను భద్రపరచుకునేందుకు లాకర్స్ మాదిరిగా 20 కప్‌బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే డ్రెసింగ్ రూమ్స్‌లో అత్యాధునిక మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.



ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వెలుపల ఆధునికీకరణ పనులు

కార్పొరేట్ బాక్స్‌లలో సదుపాయాలు

వీవీఐపీ, వీఐపీ ప్రేక్షకుల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేట్ బాక్స్‌లను పూర్తిగా ఆధునికీకరించి అత్యాధునిక సదుపాయాలు సమకూర్చుతున్నారు. టికెట్ ధరకు తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. కార్పొరేట్ బాక్స్‌లో ఏసీ, లైటింగ్, ఇతర సౌకర్యాలు ఆధునిక పద్ధతిలో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఒక్కో కార్పొరేట్ బాక్స్‌కు పరిమిత సీట్లను మాత్రమే ఏర్పాటుచేయగా గ్లాస్ డోర్‌తో కూడిన ఏసీ బాక్సులో 20 సీట్లు...అదే బాక్సుకు సంబంధించి ఓపెన్‌లో కూర్చొని మ్యాచ్‌ను వీక్షించేందుకు మరో 20 కుర్చీలను అందుబాటులో ఉంచుతున్నారు.



గ్యాలరీలపై ప్రత్యేక దృష్టి

గ్యాలరీలలో శిథిలావస్థకు చేరిన కుర్చీల స్థానంలో కొత్తవి అమర్చారు. ఐపీఎల్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ఈ కుర్చీలను పూర్తిస్థాయిలో మార్చే ఆలోచనలో ఏసీఏ ప్రతినిధులు ఉన్నారని తెలిసింది. అలాగే స్టేడియం సామర్థ్యం పెంచే ఆలోచన చేస్తున్నారని తెలిసింది. దానిపై అనుభవజ్ఞులైన ఇంజనీర్లతో చర్చిస్తున్నారని సమాచారం. ఇక గ్యాలరీలోని ప్రేక్షకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను ఆధునికీకరిస్తున్నారు.

మహిళా ప్రేక్షకుల కోసం

మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే మహిళ ప్రేక్షకుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేకంగా వాష్ రూమ్స్ ఏర్పాటుచేశారు. తగిన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.

పరీక్ష హాల్లో ఇంటర్ విద్యార్థినికి అస్వస్థత



ఎలమంచిలి సీహెచ్‌సీలో విద్యార్థినికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

ఎలమంచిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ మొదటి సంవత్సరం (ఒకేషనల్) పరీక్ష రాసేందుకు వచ్చిన ఒక విద్యార్థిని అస్వస్థతకు గురైంది. వెంటనే సీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు. రాంబిల్లి మండలం మూలజంప గ్రామానికి చెందిన ఎం.క్రాంతి ఎలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ (ఒకేషనల్) చదువుతున్నది. మంగళవారం ఉదయం పరీక్షా కేంద్రంలోకి వెళ్లిన కొద్దిసేపటికి వాంతులు కావడంతో అస్వస్థతకు గురైంది. వెంటనే కళాశాల అధ్యాపకురాలి పర్యవేక్షణలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య సేవలు అందించడంతో కోలుకున్నది. తనకు టైఫాయిడ్ జ్వరం ఉందని, ఉదయం నుంచి ఏమీ తినలేదని విద్యార్థిని చెప్పింది. పరిస్థితి మెరుగుపడిన తరువాత తిరిగి కళాశాలకు పంపించారు. అప్పటికే సమయం ముగియడంతో పరీక్ష రాయలేకపోయింది. అదే గ్రామానికి చెందిన తోటి విద్యార్థినులతో ఆమెను ఇంటికి పంపించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు.

ద్వితీయ ప్రాధాన్య ఓట్లతోనే విజయం

- గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆది నుంచి అదే వరుస



గాదె శ్రీనివాసులు నాయుడు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తుది ఫలితం ఆది నుంచి ద్వితీయ ప్రాధాన్య ఓట్లతోనే నిర్ణయమవుతోంది. శాసన మండలిని 2007లో పునరుద్ధరించిన తరువాత ఇప్పటివరకూ నాలుగుసార్లు చొప్పున పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా...ప్రతిసారి రెండో ప్రాధాన్య ఓట్లతోనే అభ్యర్థులు విజయం సాధిస్తూ వస్తున్నారు.

మండలి పునరుద్ధరణ తరువాత తొలిసారి 2007లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎంవీఎస్ శర్మ రెండో ప్రాధాన్య ఓటుతోనే విజయాన్ని దక్కించుకున్నారు. అనంతరం 2011లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంవీఎస్ శర్మ, 2013లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడు రెండోసారి రెండో ప్రాధాన్య ఓటుతోనే గెలుపొందారు. 2017లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీవీఎన్ మాధవ్, 2019లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మ రెండో ప్రాధాన్య ఓటుతో గెలిచి మండలిలో అడుగుపెట్టారు. అలాగే, 2023లో జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో వేపాడ చిరంజీవిరావు రెండో ప్రాధాన్య ఓట్లతోనే విజయాన్ని దక్కించుకోగా, తాజాగా జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె మూడోసారి రెండో ప్రాధాన్య ఓటుతో విజయాన్ని సాధించారు.

ఉపమాక వెంకన్న కల్యాణానికి రారండి!

- మంత్రి లోకేశ్ సహా పలువురు ప్రముఖులకు ఆహ్వానాలు



మంత్రి నారా లోకేశ్‌కు వెంకన్న ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, కొప్పిశెట్టి వెంకటేశ్, కురందాసు నూకరాజు. చిత్రంలో హోం మంత్రి అనిత ఉన్నారు.

నక్కపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను తిలకించేందుకు రావాలని విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ సహా పలువురు మంత్రులు, టీడీపీ పెద్దలు, ఎమ్మెల్యేలకు ఆహ్వానాలు అందజేశారు. హోం మంత్రి అనిత నేతృత్వంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు తదితరులు సోమ, మంగళవారాల్లో అమరావతిలో పలువురు ప్రముఖులను కలిశారు.

రాగల ఐదు రోజుల్లో పెరగనున్న ఉష్ణోగ్రతలు

- ఆర్ఏఆర్ఎస్‌లో అందుబాటులో చెరకు విత్తనం
- ఇన్‌చార్జి ఏడీఆర్ వెల్లడి

అనకాపల్లి అగ్రికల్చర్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ (ఇన్‌ఛార్జి) డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 నుంచి 36.8 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.2 నుంచి 21.8 డిగ్రీల మధ్య నమోదు అవుతాయని పేర్కొన్నారు. పరిశోధనా స్థానంలో మంగళవారం వాతావరణ ఆధారిత వ్యవసాయంపై జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. పిలకలు వచ్చే దశలో ఉన్న రబీ వరి పైరుకు ఎకరాకు 35 కిలోల యూరియా వేసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో జింక్ లోపం కనిపించే అవకాశం ఉందని, దీని నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్, ఐదు గ్రాముల యూరియాను కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారీ చేయాలని తెలిపారు. ాగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో చెరకు విత్తనం అందుబాటులో ఉందని, కావలసిన రైతులు తమను సంప్రదించాలని జగన్నాథరావు తెలిపారు. 2009ఎ, 107, 2009ఎ 252, 212ఎ 319, 93ఎ 145 రకాల చెరకు విత్తనం సిద్ధంగా ఉందని చెప్పారు. సమావేశంలో శాస్త్రవేత్తలు కేవీ రమణమూర్తి, వి.గౌరి, బి.భవాని, చంద్రశేఖర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

18న చలో విజయవాడ

- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి

చోడవరం, మార్చి4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పాఠశాలల భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.3 వేలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నదని, పథకం ప్రారంభించి 23 సంవత్సరాలు అవుతున్నా, కార్మికుల వేతనాల్లో ఏ మాత్రం మార్పులేదన్నారు. ఓ వైపు నిత్యావసరాల ధరలు పెరుగుతున్నా కార్మికుల .జీతాల్లో మాత్రం మార్పు ఉండడం లేదన్నారు. రకరకాల మెనూలు మార్చుతున్న ప్రభుత్వం కార్మికులపై అదనపు భారం మోపుతుండడాన్ని తప్పుపట్టారు. భోజన పథకం కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని, ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారని, దీనిపై అధికారులకు విజ్ఞప్తులు చేసినా స్పందన ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఎలాంటి ఉద్యోగ భద్రత కానీ, ప్రమాద భద్రత కానీ లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న తలపెట్టిన చలో విజయవాడ ఆందోళనను భోజన పథకం కార్మికులు విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

అనకాపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్ఏఎంపీ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జి.నాగరాజారావు తెలిపారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు వ్యవస్థాపకత, నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ఏపీఎంఎస్ఎంఈ గుర్తింపు పొందిన శిక్షణ సంస్థ ఉచిత శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. శిక్షణ తరగతులు అనకాపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో వున్న టెండ్స్ ఐటీ, చోడవరంలోని లక్ష్మీపురం రోడ్డులో వేంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా వున్న కేంద్రంలో ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఔత్సాహికులు అనకాపల్లిలో 95021 66626 నంబర్‌కు, చోడవరంలో 73860 84548 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని డీఐసీ జీఎం కోరారు.

ఇసుక తవ్వకాలకు వేలంపాటలు!

... 5వ పేజీ తరువాయి

మండలం నారాయణరాజుపేట గ్రామానికి చెందిన ఒక వ్యాపారికి ఇసుక తవ్వకం, అమ్మకాల బాధ్యతలు అప్పగించారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.1,000 చొప్పున వసూలు చేయాలని తీర్మానించారు. అయితే ఇటీవల గొట్టివాడ వద్ద వరహా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్టు సమాచారం అందుకున్న తహసీల్దార్ తిరుమలబాబు అక్కడకు వెళ్లి, ఇసుక రవాణా చేస్తున్న ఆరు ట్రాక్టర్లను సీజ్ చేశారు. వరహా నదిలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కొద్దిరోజుల పాటు తవ్వకాలు ఆగిపోయాయి. అయితే రెండు రోజుల నుంచి రాత్రిపూట ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు.

ఒక్క క్లిక్‌తో రిజిస్ట్రేషన్ సేవలు

... 5వ పేజీ తరువాయి

ఉంటాయి. సబ్ రిజిస్ట్రార్ సంతకంతో ఈసీ కావాలంటే మొదటి ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అందులోనే పేరు, చిరునామా, దస్తావేజు నంబరు, రిజిస్ట్రేషన్ జరిగిన సంవత్సరం నమోదు చేస్తే ఎలాంటి రుసుము లేకుండా సమాచారం పొందవచ్చు. అదే రిజిస్ట్రార్ సంతకం లేకుండా కావాలంటే రెండో ఆప్షన్‌పై క్లిక్ చేస్తే యూజర్ లాగిన్ ఆప్షన్ కనిపిస్తుంది. అందులో ఈమెయిల్ ఐడీ, ఫోన్ నంబరు, ఆధార్ నంబరు నమోదు చేస్తే మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఆ నంబరును నమోదు చేస్తే ఈసీ, సీసీ ఆప్షన్‌లు కనిపిస్తాయి. ఏది అవసరమో దానిపై క్లిక్ చేసి దస్తావేజు నంబరు, రిజిస్ట్రేషన్ సంవత్సరం, రిజిస్ట్రార్ కార్యాలయం చిరునామా వివరాలు నమోదు చేసిన తరువాత ఓకే చేసి ఆన్‌లైన్‌లో రుసుం చెల్లిస్తే యూజర్ లాగిన్‌లో దస్తావేజు ఫైల్ కనిపిస్తుంది. దీనిని డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవచ్చు. 30 సవంత్సరాలు పైబడిన ఈసీ పొందాలనుకుంటే రూ.600, దస్తావేజు నకళ్ల కోసం రూ.320 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.

క్రైం... crime news

30 లీటర్ల సారాతో మహిళ అరెస్టు

పాయకరావుపేట రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం కోనేరు సమీపంలో మంగళవారం ఉదయం దాడులు నిర్వహించి 30 లీటర్ల నాటుసారాతో ఒక మహిళను అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనువాసు తెలిపారు. నిందితురాలిని అరెస్టు చేసి ఎలమంచిలి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించినట్టు చెప్పారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

రాంబిల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో కృష్ణంపాలెం గ్రామానికి చెందిన లాలం రామదాసును మంగళవారం పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. ఇతను ఈ నెల రెండో తేదీన ఇదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేసినట్టు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారని చెప్పారు. దీనిపై మంగళవారం పరవాడ డీఎస్పీ విచారణ నిర్వహించి రామదాసును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారని ఆయన పేర్కొన్నారు.

పిల్లలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పి.రవికుమార్

అనకాపల్లి టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా వుందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.రవికుమార్ అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో 'పిల్లలపై లైంగిక వేధింపులు ఏ విధంగా నివారించాలి' అనే అంశం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడిన వారికి చట్ట ప్రకారం కఠిన శిక్షలు అమలవుతాయని హెచ్చరించారు. అపరిచితుల విషయంలో జాగ్రత్తగా వుండడానికి పిల్లలకు తర్ఫీదు ఇవ్వాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రశాంతి మాట్లాడుతూ, పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్రస్థాయి ట్రైనర్ ఉదయ్‌కుమార్, సైకాలజిస్ట్ బి.నాగరాజు.. పిల్లలు లైంగిక వేధింపుల విషయంలో అప్రతమత్తంగా వుండడం గురించి వివరించారు. పిల్లలకు ఏది మంచి, ఏది చెడో ఉపాధ్యాయులు కూడా తెలియజేయాలని పేర్కొన్నారు.

పిఠాపురం అభివృద్ధికి సింహాద్రి ఎన్టీపీసీ సాయం

- రూ.2.85 కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు

పరవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక సింహాద్రి ఎన్టీపీసీ అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతంలో మౌలిక వసతులు, ఆరోగ్యం, విద్యాభివృద్ధికి రూ.2.85 కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించి ఎన్టీపీసీ హెచ్‌వోపీ సమీర్‌శర్మ, కాకినాడ జిల్లా కలెక్టర్‌తో ఎంవోఏ చేసుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను కాకినాడ చీఫ్ ప్లానింగ్ అధికారికి మంగళవారం ఇక్కడ అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి అధికారులు బీబీ పాత్ర, కె.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి హెచ్‌వోపీకి ఈడీగా పదోన్నతి



సమీర్‌శర్మ

పరవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు(హెచ్ఓపీ)కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఎన్టీపీసీ సీఎండీ గుర్‌దీప్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేసినట్టు సింహాద్రి పీఆర్‌వో ఒక ప్రకటనలో తెలిపారు. సమీర్‌శర్మ ఇక నుంచి ఈడీగా కూడా వ్యవహరిస్తారు.

రుషికొండ బీచ్‌లో పుణె బృందం తనిఖీలు

- 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు పునరుద్ధరణకు ఈ బృందం ఇచ్చే నివేదికే కీలకం

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని రుషికొండ బీచ్‌లో సరైన వసతులు, పరిశుభ్రత లేని కారణంగా 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపును తాత్కాలికంగా ఉపసంహరించిన నేపథ్యంలో పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగాంగా పుణెకు చెందిన సంస్థ రాయల్ లైఫ్ సేవింగ్ సొసైటీ మంగళవారం బీచ్‌కు వచ్చి తనిఖీలు నిర్వహించింది. బీచ్‌లో పర్యాటకులు మునిగిపోతే ఎలా రక్షిస్తారు? అనే అంశంపై లైఫ్‌గార్డులను అడిగి తెలుసుకుంది. వారికి వృత్తిపరమైన అవగాహన ఉందా?, లేదా? అని పరీక్షించింది. మరో రెండు ఇతర అంశాలను కూడా పరిశీలించనున్నది. వీరు సమర్పించే నివేదిక ఆధారంగా బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై చర్యలు తీసుకుంటారు.

ఇంటర్మీడియట్ పరీక్షకు 13,709 మంది హాజరు

అనకాపల్లి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 13,709 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 11,620 మందికిగాను 11,297 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,629 మందికిగాను 2,412 మంది పరీక్ష రాశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439